వారా నూకరాజు హత్యకేసులో ఏడుగురి అరెస్టు

- నిందితుల్లో ఇద్దరు మహిళలు
- వివరాలను వెల్లడించిన డీఎస్పీ శ్రావణి

- 8లో

అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు హత్య కేసుకు సంబంధించి ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్టు అనకాపల్లి డీఎస్పీ శ్రావణి తెలిపారు.

ముసురు

పలు మండలాల్లో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నదులు, వాగులు, గెడ్డల్లో పెరిగిన వరద ప్రవాహం
- నేడు, రేపు కూడా వర్షాలు కురిసే అవకాశం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ కొనసాగింపు


అనకాపల్లిలో వర్షం


మునగపాకలో వర్షం

అనకాపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి వరకు దఫదఫాలుగా వర్షం కురుస్తూనే వుంది. కొన్ని మండలాల్లో భారీ వర్షం, మరికొన్ని మండలాల్లో మోస్తరు వర్షం పడింది. రోజంతా ముసురు వాతావరణం నెలకొంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. కొన్నిచోట్ల రహదారులపై వర్షం నీరు ప్రవహించి కాలువలను తలపించాయి. నదులు, వాగులు, గెడ్డల్లో వరద ప్రవాహం పెరిగింది. అన్ని జలాశయాల్లోకి వరద నీరు చేరుతున్నది. తాండవ మినహా మిగిలిన రిజర్వాయర్ల స్పిల్‌వే గేట్లు ఎత్తి అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆయా నదులకు ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. కాగా వర్షాల వల్ల పలుచోట్ల రహదారులు దెబ్బతింటున్నాయి. బీఎన్ రోడ్డులో చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాలు, వడ్డాది- పాడేరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో మాడుగుల మండలంలో, కశింకోట మండలం తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్డులో పలుచోట్ల ఏర్పడిన భారీ గోతుల్లో నీరు నిలిచి చెరువులను తలపించాయి. గోతుల్లో నుంచి ప్రయాణించడానికి వాహనదారులు ఇబ్బందిపడ్డారు. ఇదిలావుండగా అధిక వర్షాల కారణంగా పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. లోతట్టు భూముల్లో ఎక్కువ రోజులు నీరు నిలిచిపోతే అపరాలు, కూరగాయలు, పత్తి, మిర్చి వంటి పంటలు దెబ్బతింటాయని అంటున్నారు.


అనకాపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా నది

పొంగిన ఏలేరు కాలువ

- జాతీయ రహదారిపైకి నీరు

అనకాపల్లి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పాక వద్ద జాతీయ రహదారి నీట మునిగింది. వర్షాల కారణంగా ఏలేరు కాలువ పొంగి, హైవేపైకి భారీగా నీరు వస్తున్నది. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు వంటి చిన్నపాటి వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.


కొప్పాక వద్ద ఏలేరు కాలువలో నుంచి జాతీయ రహదారిపైకి వచ్చిన నీరు

అధికారులు అప్రమత్తం

జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాల ప్రజలకు సహాయ చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎక్కడా ప్రాణహాని జరగకుండా చూడాలన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

వర్షాలు కురుస్తుండడంతో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మరో రెండు రోజులపాటు కొనసాగించనున్నారు. సిబ్బంది 24 గంటలు పనిచేసేలా వివిధ కార్యాలయాల నుంచి డిప్యూటేషన్‌పై నియమించారు. కంట్రోల్ రూమ్‌లో 08924-288888, 08924-225999, 08924-226599 ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచారు.

వర్షపాతం...

జిల్లాలో గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు.. నాతవరం మండలంలో 25.88 మిల్లీమీటర్లు, చోడవరంలో 22.75, దేవరాపల్లిలో 20.38, మాకవరపాలెంలో 14.25, రావికమతంలో 13.33, బుచ్చెయ్యపేటలో 12.13, కశింకోటలో 11.88, కె.కోటపాడులో 11.38, నర్సీపట్నంలో 10.88, కోటవురట్లలో 10.50, రోలుగుంటలో 10.50, మునగపాకలో 9.38, అనకాపల్లిలో 8.97, మాడుగులలో 7.67, గొలుగొండలో 7.38, నక్కపల్లిలో 7, చీడికాడలో 6, పాయకరావుపేటలో 4.5, పరవాడలో 4.29, ఎలమంచిలిలో 4.14, ఎస్.రాయవరంలో 3.88, సబ్బవరంలో 0.92, రాంబిల్లిలో 0.63, అచ్యుతాపురంలో 0.13 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

అనకాపల్లిలో..

అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం దఫదఫాలుగా ... మిగతా 8వ పేజీలో

నేడు రాజయ్యపేటకు కలెక్టర్

బల్క్‌డ్రగ్ పార్కుపై మత్స్యకారులతో సమావేశం కానున్న విజయకృష్ణన్


రాజయ్యపేట మత్స్యకారులతో మాట్లాడుతున్న తహశీల్దార్ నరసింహమూర్తి, సీఐ మురళీ


విజయకృష్ణన్, కలెక్టర్

అనకాపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం నక్కపల్లి మండలం రాజయ్యపేట వెళ్లనున్నారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ సుమారు ఆరు వారాలుగా మత్స్యకారులు నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 12వ తేదీన మత్స్యకారులు నక్కపల్లి వరకు ర్యాలీగా వచ్చి జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో సుమారు నాలుగు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. డివిజన్‌స్థాయి అధికారులు నచ్చజెప్పినా.. మత్స్యకారులు ఆందోళన విరమించలేదు. దీంతో కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. త్వరలో రాజయ్యపేటకు వచ్చి, అన్ని విషయాలపై మత్స్యకారులతో మాట్లాడతానని కలెక్టర్ హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. వాస్తవంగా కలెక్టర్ గత వారమే రాజయ్యపేట వెళ్లాల్సి వుంది. కానీ వ్యక్తిగత కారణాల వల్ల ఆమె పర్యటన వాయిదా పడింది. శుక్రవారం కలెక్టర్‌తోపాటు ఎస్పీ కూడా రాజయ్యపేట వెళుతున్నారు. మత్స్యకారుల సమస్యలపై వారితో శాంతియుతంగా చర్యలు జరిపి, వారి అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళతారని తెలిసింది.

నేతలను గృహనిర్బంధం చేయొద్దు


అధికారులకు మత్స్యకారుల వినతి

నక్కపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం రాజయ్యపేట పర్యటన సందర్భంగా నేతలెవరినీ గృహనిర్బంధం చేయవద్దని మత్స్యకార నేతలు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. తహశీల్దార్ నరసింహమూర్తి, సీఐ మురళీ గురువారం రాజయ్యపేట వెళ్లి మత్స్యకారులతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం పది గంటలకు కలెక్టర్ ఇక్కడకు వస్తారని చెప్పారు. అయితే తమ పోరాటానికి ఆది నుంచీ మద్దతు ఇస్తున్న సీపీఎం నేత అప్పలరాజు, వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ, శీరం నరసింహమూర్తి, గుర్రాజుపేటకు చెందిన దాట్ల ఉమాదేవి, సీపీఐ నేత దొరబాబులను గృహనిర్బంధం చేయకూడదని, కలెక్టర్ సమక్షంలో వారు కూడా మాట్లాడేందుకు అనుమతులివ్వాలని మత్స్యకారులు కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తహశీల్దార్ చెప్పారు. కాగా కలెక్టర్ పర్యటన నేపథ్యంలో నక్కపల్లి హైవే జంక్షన్ నుంచి రాజయ్యపేట వరకు పోలీస్ బలగాలను మోహరించనున్నట్టు తెలిసింది.

జలాశయాలకు వరద

పరీవాహక ప్రాంతాల్లో వర్షాలతో కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

స్పిల్‌వే గేట్లు ఎత్తి.. దిగువకు విడుదల


నిండుకుండలా దర్శనమిస్తున్న తాండవ జలాశయం

మాడుగుల రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరువగా ఉంది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు. కాగా గురువారం సాయంత్రానికి 136.50 మీటర్లకి చేరింది. ఇన్‌ఫ్లో 380 క్యూసెక్కులు నమోదైందని మరింత పెరిగే అవకాశం ఉన్నందున రాత్రి తొమ్మిది గంటలకు జలాశయం మూడో గేటు తెరిచి 350 క్యూసెక్కులు నీరు విడిచిపెడుతున్నట్లు జలాశయం ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

తాండవకు 567 క్యూసెక్కుల వరద

నాతవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్‌లోకి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 377.6 అడుగులు ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో 567 క్యూసెక్కుల వదర నీరు వచ్చి చేరుతున్నది. కాలువల ద్వారా ఆయకట్టుకు ఇంతే మొత్తంలో నీటిని విడుదల చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించినందున గురువారం రాత్రి నుంచి ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం వుందని ప్రాజెక్టు డీఈఈ అనురాధ తెలిపారు.

కల్యాణపులోవకు 280 క్యూసెక్కుల వరద

రావికమతం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపులోవ జలాశయానికి వరద ప్రవాహం గురువారం కూడా కొనసాగింది. రిజర్వాయర్ గరిష్ఠ నీటమట్టం 460 అగులుకాగా, 280 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతున్నది. గురువారం నీటిమట్టం 458.08 అడుగుల వద్ద నిలకడగా వుంచుతూ, స్పిల్‌వేలో రెండు గేట్లు ఎత్తి 250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరో 40 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు సరఫరా చేస్తున్నారు. రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మండలాల్లో సర్పా నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసినట్టు జలాశయం ఏఈ డి.సూర్య తెలిపారు.


కల్యాణపులోవ రిజర్వాయర్ గేట్ల నుంచి నదిలోకి విడుదలవుతున్న నీరు

దొంగనోట్ల ముఠా గుట్టు రట్టు

- మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి అరెస్టు
- దొంగనోట్ల తయారీకి వాడే పరికరాలు, యంత్రాలు స్వాధీనం
- మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు

- 8లో

జగన్ ఆరోపణలు అవాస్తవం

ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నం

- ఆయన మాటలను జనం నమ్మే స్థితిలో లేరు
- వైసీపీ హయాంలో మద్యం అమ్మకాల్లో పెద్ద ఎత్తున దోపిడీ
- ఎంపీ సీఎం రమేశ్ ధ్వజం


మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్. పక్కన మంత్రి కొల్లు రవీంద్ర

అనకాపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ తప్పుడు ఆరోపణలతో ప్రజలను గందరగోళానికి గురిచేయాలని ప్రయత్నిస్తున్నారని, ఇటువంటి వాటిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. గురువారం సాయంత్రం ఇక్కడ తన క్యాంపు కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై జగన్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. వైసీపీ హయాంలో మద్యం అమ్మకాల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందని రమేశ్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే జగన్ తప్పుడు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ అధికారంలో వున్నప్పుడు మద్యం అమ్మకాల్లో విపరీతమైన దోపిడీ జరగడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. డిస్టిలరీలను వైసీపీ నేతలు తమ ఆధీనంలోకి తీసుకుని, నాణ్యతలేని మద్యాన్ని తయారు చేశారని, ఈ మద్యాన్ని ప్రభుత్వ దుకాణాల ద్వారా విక్రయించి, మద్యం ప్రియుల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీశారని ఆరోపించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సొంత మనుషులను పెట్టుకొని భారీగా దోచేశారని విమర్శించారు. వైసీపీ అధికారంలో వున్నప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేస్తే.. ప్రపంచ వ్యాప్తంగా ఐటీ ఉద్యోగులు నిరసన తెలిపారని, ఐటీ రంగం అభివృద్ధికి చంద్రబాబు చేసిన కృషికి ఇదే నిదర్శనమన్నారు. గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేస్తే ఉత్తరాంధ్ర ఎంత అభివృద్ధి చెందుతుందో ప్రజలకు తెలుసని, జగన్ అబద్ధపు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని సీఎం రమేశ్ అన్నారు.

మంత్రి కొల్లు రవీంద్ర ... మిగతా 8వ పేజీలో

నర్సీపట్నం ఆస్పత్రిలో చురుగ్గా అభివృద్ధి పనులు

ప్రత్యేక దృష్టి సారించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

- డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం
- రూ.40 లక్షల స్పెషల్ గ్రాంట్‌తో పనులు
- ఆపరేషన్ థియేటర్‌లో సెంట్రల్ ఆక్సిజన్
- సీఎస్ఆర్ నిధులతో అత్యాధునిక లైఫ్ సపోర్టు అంబులెన్స్
- ఎస్ఎన్‌సీయూ గది ఆధునికీకరణ
- త్వరలో అందుబాటులోకి క్యాంటీన్


డ్రైనేజీ పనులు జరుగుతున్న దృశ్యం

నర్సీపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏళ్ల తరబడి ఇబ్బంది పెడుతున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపడుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ అయిన చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆస్పత్రి నిర్వహణపై దృష్టి పెట్టారు. తరుచూ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహిస్తూ, అధికారులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. దీంతో ఆస్పత్రి నిర్వహణ విషయంలో గత ప్రభుత్వం కంటే ఇప్పుడు పర్యవేక్షణ పెరిగింది. అయ్యన్న సతీమణి, 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి సైతం తరచూ ఆస్పత్రిని సందర్శిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ద్వారా సీఎస్ఆర్ గ్రాంట్ నుంచి అత్యాధునిక లైఫ్ సపోర్టు అంబులెన్స్ మంజూరు ... మిగతా 8వ పేజీలో


నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రి

యథేచ్ఛగా భూకబ్జాలు

మాకవరపాలెం మండలంలో పెరిగిపోతున్న ఆక్రమణలు

- రెవెన్యూ సిబ్బందితో కబ్జాదారులు కుమ్మక్కు
- రికార్డుల్లో సాగుదారులుగా పేర్లు నమోదు
- డి.పట్టాలు, పాసుపుస్తకాలు జారీ


తామరం సర్వే నంబరు 61/3లో కబ్జాకు గురైన గెడ్డ పోరంబోకు భూమి

మాకవరపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): **మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కొంతమంది స్థానికేతర బడాబాబులు ఇక్కడ రెవెన్యూ అధికారులు, సిబ్బందితో లాలూచిపడి ప్రభుత్వ, సీలింగ్, ఇనాం భూములను తమ పరం చేసుకుంటున్నారు.**

మాకవరపాలెం మండలంలో వందలాది ఎకరాల ప్రభుత్వ బంజరు, సీలింగ్, ఇనాం భూములు ఉన్నాయి. ఈ ప్రాంతంలో కంపెనీలు, పరిశ్రమలు వస్తుండడంతో భూములకు గిరాకీ పెరిగింది. దీంతో ధనవంతులు, రాజకీయ పలుకుబడి వున్న వారి దృష్టి ప్రభుత్వ భూములపై పడింది. మండలంలో ఇప్పటికే పయనీర్ కంపెనీ (గతంలో అన్‌రాక్) ఏర్పాటు కావడం, వైద్య కళాశాల నిర్మిస్తుండడం, ఏపీఐఐసీకి చెందిన 300 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటవుతుందని అధికారులు చెబుతుండడం, 400 ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీ వస్తుందని ప్రచారం సాగడంతో భూముల ధరలు గణనీయంగా పెరిగాయి. దీంతో ప్రభుత్వ భూముల ఆక్రమణలు అధికం అయ్యాయి.

మండలంలో జి.వెంకటాపురం, తామరం, రాచపల్లి, మామిడిపాలెం, పైడిపాల, జి.కోడూరు తదితర గ్రామాల్లో వందల ఎకరాల బంజరు భూములు దశాబ్దాలుగా అన్యుల సాగులో వున్నాయి. వీరంతా వాస్తవంగా పేదలే అయినప్పటికీ, ఇప్పుడు ఈ భూములకు విలువ బాగా పెరగడంతో రాజకీయ నేతల కన్ను పడింది. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై.. రికార్డుల్లో సాగుదారులుగా తమ పేర్లు, లేదా కుటుంబ సభ్యుల పేర్లు చేర్పిస్తున్నారు. 2013లో రాచపల్లి గ్రామానికి చెందిన ఒక నాయకుడు సర్వే నంబరు 61/3లో ఏకంగా 21.6 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడు. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో అప్పటి అధికారులు స్పందించి భూమిని స్వాధీనం ... మిగతా 8వ పేజీలో

అల్పపీడన ప్రభావంతో వర్షాలు

దపదపాలుగా పడుతున్న వర్షం
లోతట్టు ప్రాంతాలు జలమయం
ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు



కోటవురట్లలో వర్షం



పాయకరావుపేటలో పడుతున్న వర్షం



ఎలమంచిలిలో వర్షం

కోటవురట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో గురువారం మండలంలో భారీ వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం నుంచి గురువారం రోజంతా ముసురు వర్షం పడింది. భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. గెడ్డలు, వాగులు గట్లుకు ఆనుకొని ప్రవహిస్తున్నాయి. మండలంలో తంగేడు, జల్లూరు, బీకేపల్లి లింగాపురం, కైలాసపట్నం, రాజుపేట, సుంకపూర్‌గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వరి పంట పొట్టదశలో ఉన్న కారణంగా వర్షాలు అధికంగా కురిస్తే చేను ఒరిగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పాయకరావుపేటలో..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా పట్టణంలో గురువారం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దపదపాలుగా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సాయంత్రం గంట పాటు పడిన వర్షానికి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. మెయిన్‌రోడ్డులోని పల్లపు ప్రాంతాలు చెరువులను తలపించాయి. పలు కాలనీల్లోని మురికినీరు వర్షపు నీటితో కలిసి రోడ్లపై ప్రవహించి ప్రజలకు ఇబ్బందులకు గురిచేసింది. వర్షం కారణంగా రోడ్లపై దుకాణాలు, తోపుడు బండ్లు పెట్టుకున్న చిరువ్యాపారులు ఇబ్బంది పడ్డారు.

ఎస్.రాయవరంలో..

మండలంలో గురువారం ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి దపదపాలుగా జల్లులు పడుతూ సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. పలు గ్రామాల్లో రహదారులపై వర్షపు నీరు నిలిచింది.

మునగపాకలో..

మండలంలో ముసురు వాతావరణం నెలకొంది. పలు దఫాలుగా జల్లులు పడ్డాయి. ఈ జల్లులు వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం 8 గంటల సమయానికి 26.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా. అప్పటి నుంచి సాయంత్రం 5 గంటల వరకు 7 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు అయ్యిందని అధికారులు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ పి.సత్యనారాయణ తెలిపారు. ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా 08924257624 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎలమంచిలిలో..

అల్పపీడనం కారణంగా ఎలమంచిలిలో గురువారం పలుమార్లు మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. ఓ పక్క ఎండ.. మరో పక్క వర్షం పడుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. సాయంత్రం 3 గంటల నుంచి వాతావరణం చల్లబడి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడ్డాయి.

గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన భూలోకమాంబ



ఎలమంచిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పంచరాత్రుల మహోత్సవంలో భాగంగా తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మవారు గురువారం గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఆవరణలో పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొళాయిల్లో బురద నీరు



కొత్తపేట కాలనీలో కొళాయిల నుంచి వచ్చిన బురద నీరు

ఎలమంచిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి కొళాయిల నుంచి బురద నీరు సరఫరా అవుతోంది. గత కొన్ని రోజుల నుంచి కొత్తపేట ప్రాంతంలోని కొళాయిల నుంచి బురద నీరు సరఫరా అవుతుందని ఆ ప్రాంత వాసులు తెలిపారు. ఈ విషయాన్ని పట్టణ తాగునీటి విభాగం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పూర్తి స్థాయిలో స్పందించలేదని తెలిపారు. సిబ్బంది వచ్చి కొళాయి నుంచి వచ్చిన నీటిని పరిశీలించి వెళ్లారని, అయినా మరుసటి రోజు అదేవిధంగా బురద నీరు వస్తుందని వారంటున్నారు. మునిసిపల్ పాలకులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జాబ్ కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి



సత్యవరంలో జాబ్ కార్డుదారులకు ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి హామీ జాబ్ కార్డుదారులకు ఈకేవైసీ చేస్తున్నామని ఏపీవో నానిబాబు అన్నారు. గురువారం సత్యవరంలో జాబ్ కార్డుదారులకు చేస్తున్న ఈకేవైసీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ఈకేవైసీ చేయించుకోకపోతే పథకం కింద ప్రయోజనాలను పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. మస్తర్లలో జరుగుతున్న మోసాలు, బోగస్ హాజరు, నకిలీ ఫొటోలు వంటి అక్రమాలను అరికట్టేందుకు రాష్ట్రప్రభుత్వం ఈకేవైసీ తప్పనిసరి చేసిందన్నారు. మండలంలో 14,600 జాబ్ కార్డులుండగా యాక్టివ్‌లో 10,756 జాబ్ కార్డులున్నాయన్నారు. ఇప్పటికి 7,830 మంది జాబ్ కార్డు హోల్డర్ల ఈకేవైసీ పూర్తయిందన్నారు. అన్ని గ్రామాలలో 72.8 శాతం పూర్తయిందన్నారు.

అచ్యుత కాలేజీ విద్యార్థినికి బంగారు పతకం



గోల్డ్ మెడల్ సాధించిన మేఘనా బ్లెస్సీ

అచ్యుతాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ పోటీల్లో స్థానిక అచ్యుత జూనియర్ కాలేజీకి చెందిన బి.మేఘనా బ్లెస్సీ బంగారు పతకం సాధించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సబ్బవరంలో ఈనెల 21న నిర్వహించిన పోటీల్లో మార్షల్ ఆర్ట్స్ విభాగంలో మేఘన బంగారు పతకాన్ని సాధించింది. విద్యార్థినిని కరస్పాండెంట్ శేషగిరిరావు, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

'వృద్ధులను రేషన్ డిపోలకు రప్పిస్తే చర్యలు'

ఎస్.రాయవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరఫరా చేయాలని, అలా కాకుండా రేషన్ డిపోలకు రప్పిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ జె. రమేశ్‌బాబు రేషన్ డీలర్లను హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 26 వేల కార్డులకు గాను 24,700 కార్డుదారులకు రేషన్ పంపిణీ చేశామన్నారు. మిగతా 1300 కార్డులను కూడా త్వరగా పంపిణీ చేయాలన్నారు. స్మార్ట్ కార్డులు తీసుకోని వారు వెంటనే వాటిని తీసుకోవాలన్నారు.

ఘనంగా హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు

రాంబిల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లిలో గురువారం సాయంత్రం ప్రముఖ సినీ హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాస్ ఫ్యాన్స్ మండల అధ్యక్షుడు వర్మరాజు కేక్‌ను కట్ చేసి, అందరికి పంచారు. క్షత్రియ యూత్ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థిని సురక్షితం : ఎస్ఐ

మునగపాక, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిన విద్యార్థిని సురక్షితంగా ఉందని ఎస్ఐ పి.ప్రసాదరావు గురువారం తెలిపారు. మండలంలోని గణపర్తికి చెందిన విద్యార్థిని ఈనెల 20వ తేదీన తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిందన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. విద్యార్థిని బంధువుల ఇంట్లో ఉన్న విషయాన్ని తెలుసుకొని తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు ఎస్ఆర్‌ల పంపిణీ

కోటవురట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల సంతబయల జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మెగా డీఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ ప్రతినిధులు గురువారం ఎస్ఆర్‌లు ఉచితంగా అందజేశారు. ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సత్యాడ సంగీతరాజు, ప్రధాన కార్యదర్శి లోవరాజు, రాష్ట్ర ప్రతినిధి సత్యాడ దాసు, ఆర్. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ మండలంలో కొత్తగా ఉద్యోగాల్లో చేరిన 17మందికి ఎస్ఆర్‌లు అందజేశామన్నారు.

జానపద కళాకారులకు సత్కారం రేపు

మునగపాక, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో తిమ్మరాజుపేటలో నాగుల చవితి సందర్భంగా ఈ నెల 25వ తేదీన జానపద కళాకారులకు సత్కారం జరుగుతుందని మాజీ సర్పంచ్ సూరిశెట్టి రాజేశ్వరి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ సూరిశెట్టి రాములు తెలిపారు. రేలారే రేల కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

'జాలర్లను విడిపించాలి'

పాయకరావుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ కోస్ట్ గార్డ్‌కి పట్టుబడిన భోగాపురం మండలం పెద్దకొండరాజుపాలెం గ్రామానికి చెందిన ఎనిమిది మంది మత్స్యకారులను విడిపించాలని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పెద్దకొండరాజుపాలెంకి చెందిన సురపతి రాము, మారుపిల్లి రమేష్, చిన్నఅప్పన్న, ప్రవీణ్, సూరాడ అప్పలకొండ, వడ్డాది సత్యనారాయణ, పూసపాటిరేగ మండలం తిప్పలవలసకి చెందిన వాసుపల్లి సీతయ్య, నక్క రమణలను ఈనెల 13వ తేదీన విశాఖ నుంచి చేపల వేటకు వెళ్లారన్నారు. ఈనెల 14వ తేదీ బంగ్లాదేశ్ బోర్డర్‌లోకి పొరపాటున వెళ్లి అక్కడి కోస్ట్ గార్డ్‌కి పట్టుపడ్డారన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మత్స్యకారులను విడిపించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వారి కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అవకాశాలను అందిపుచ్చుకుంటే బంగారు భవిష్యత్తు

జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గోవిందరావు



మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గోవిందరావు

కోటవురట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అవకాశాలను నిరుద్యోగులు అందిపుచ్చుకుంటే భవిష్యత్తు బంగారు బాటగా సాగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గోవిందరావు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్‌మేళాకు పాయకరావుపేట, ఎస్.రాయవరం, కోటవురట్ల, నక్కపల్లి మండలాల నుంచి వందలాది మంది నిరుద్యోగులు తరలివచ్చారు. వివిధ కంపెనీల్లో 1,740 ఉద్యోగాలను భర్తీచేయడానికి 18 కంపెనీల నుంచి ప్రతినిధులు వచ్చారన్నారు. ఈ జాబ్‌లో అర్హులైన 222 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు మాట్లాడుతూ జాబ్‌మేళాలో ఎంపికైన వారు దూరమని, జీతం తక్కువగా ఉందని ఆలోచించవద్దని, అక్కడ పనితీరు అనుసరించి జీతం పెరుగుతుందన్నారు. అనుభవం ఉంటే దగ్గరలోని కంపెనీలకు బదిలీపై రావచ్చునన్నారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ త్వరలోనే నక్కపల్లి మండలం రాజయ్యపేట ప్రాంతంలో స్టీల్‌ప్లాంట్ వస్తుందని, కొత్త 60వేలు ఉద్యోగులు పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు వేచలపు జనార్దన్, సీనియర్ నాయకుడు జానకి శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు పీ సూర్యారావు, జానకి హరిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఏకశిలతో అయ్యప్పస్వామి ఆలయ మెట్లు

ఎస్.రాయవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ 18 మెట్లకు ఏకశిలను వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు సమక్షంలో గురువారం అమర్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సోమిరెడ్డి రాజు, కొణతాల శ్రీనివాసరావు, ఎడ్ల వరహాలరావు, గుడివాడ సర్పంచ్ దూళి శ్రీనుబాబు, పినపాత్రుని గిరిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి ఆలయ 8 మెట్లకు ఏకశిలను అమర్చుతున్న దృశ్యం

ఎలమంచిలి రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన సీనియర్ ఎస్‌డీఎం

- ప్రయాణికులతో సమావేశమైన నరేంద్రవర్మ
- ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని వినతి



ఎలమంచిలి స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ కోరుతూ వినతిపత్రం అందజేస్తున్న రైల్వే ప్రయాణికుల అసోసియేషన్ సభ్యులు

ఎలమంచిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి రైల్వే స్టేషన్‌ను గురువారం రైల్వే సీనియర్ డివిజనల్ మేనేజరు(ఆపరేషన్స్) డి.నరేంద్రవర్మ సందర్శించారు. అమృత సంవాదం కార్యక్రమంలో భాగంగా స్టేషన్ ఆవరణలో స్థానికులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. స్థానికుల నుంచి పలు సమస్యలు తెలుసుకున్నారు. స్టేషన్ ఆవరణలో అమృత్ భారత్‌లో భాగంగా నిర్మితమవుతున్న భవనాలను పరిశీలించారు. స్టేషన్ సూపరింటెండెంట్ సురేష్ కుమార్ పలు విషయాలను ఆయనకు వివరించారు. స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన విధంగా ఆధునాతన వసతులను కల్పించడం జరుగుతుందన్నారు. ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ ఇప్పించాలని కోరుతూ నరేంద్రవర్మకు ప్రయాణికుల అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. స్టేషన్‌లో రత్నాచల్, ప్రశాంతి, మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇప్పించాలని కోరారు. అదేవిధంగా కోచ్ ఇండికేషన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్. సురేష్ కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు నంద, డైలీ ప్యాసింజర్స్ అసోసియేషన్ సభ్యులు, ఆడారి పూరి జగన్నాథం, జయంత్, పిట్టా దాసుబాబు, హనుమంతురావు, రాజారావు, నక్కా శివ, లక్ష్మణరావు, కమలాకర్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే సుందరపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ కుమార్

అచ్యుతాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఏపీఐఐసీ కార్యాలయంలో ఆర్డీఓ ఆయిషా సమక్షంలో ఆర్అండ్‌బీ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవసరమైతే మెన్ పవర్‌ని పెంచి నిర్మాణ పనులు పూర్తిచేయాలన్నారు. మార్టూరు జంక్షన్ నుంచి సెజ్ కర్మాగారాలకు కనెక్టివిటీ రోడ్డు నిర్మాణం పూర్తికావచ్చిందన్నారు. అలాగే హరిపురం నుంచి వెదురువాడ, మార్టూరు మీదుగా సెజ్ ప్రధాన రోడ్డుని కలుపుతూ వందడుగుల రోడ్డుకు ప్రణాళిక సిద్ధమైందన్నారు. దీని సర్వే త్వరలో చేపడతామన్నారు. అలాగే చోడపల్లి నుంచి రాంబిల్లి మండలం వెంకటాపురం వరకు మరో వందడుగుల రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశారన్నారు. అప్పన్నపాలెం నుంచి చోడపల్లి వరకు కూడా వందడుగుల రోడ్డు నిర్మాణం త్వరలో చేపట్టనున్నామన్నారు. అధికారులు సహకరించి, పనులు వేగవంతం కావడానికి కృషిచేయాలన్నారు.

వరిలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బీసీటీ కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్



వరిని ఆశించిన పాముపొడ తెగులు

రాంబిల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వరి పంటను ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బీసీటీ కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ అన్నారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో వరి పైరును పాముపొడ తెగులు ఆశించిందన్నారు. ఈ తెగులు ఆశించిన చోట నీటి మట్టానికి దగ్గరలో పాముపొడ లాంటి మచ్చలు ఏర్పడి, క్రమేపి ఆకులు, దుబ్బులు ఎండిపోతాయని అన్నారు. ఈ తెగులు నియంత్రణకు హెక్సాకొనజోల్ మందు ప్రతి లీటర్ నీటికి 2 మిల్లీలీటర్లు చొప్పున లేదా ప్రొఫికొనజోల్ మందు 1 మిల్లీలీటరు చొప్పున పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు. యూరియా వేయడం వలన ఈ తెగులు ఉధృతి పెరుగుతుందన్నారు. పొటాష్ ఎరువు వేయాలన్నారు. పొటాష్ ఎరువులు వేయలేని వారు పొటాషియం నైట్రేట్ పొడిమందును ఎకరాకు కిలో చొప్పున పిచికారీ చేయడం ద్వారా మొక్కలు తిరిగి ఆరోగ్యంగా తయారవుతాయన్నారు. పొలంలో నీటిపారుదల ఆపడం ద్వారా పక్క పొలాలకు ఈ తెగులు వ్యాపించకుండా అరికట్టవచ్చునన్నారు. తెగులు పూర్తిగా తగ్గిన తరువాత యూరియాను తక్కువ మోతాదులో దపాలుగా వాడాలన్నారు. అగ్గి తెగులు, పొడ తెగులు ఉన్నప్పుడు అజాక్సిస్ట్రొబిన్, టెబ్యూకొనజోల్ మందును ఎకరాకు 300 మిల్లీలీటర్లు లేదా ట్రైఫ్లాక్సిస్ట్రొబిన్, టెబ్యూకొనజోల్ మందు ఎకరాకు 160 గ్రాముల వరకు వాడడం ద్వారా పొడ, అగ్గి, గోధుమ తెగుళ్ల దీర్ఘకాలం పూర్తిగా నియంత్రించబడతాయన్నారు. పొటాష్ ఎరువులను తప్పనిసరిగా వాడడం ద్వారా చీడపీడలను తట్టుకొనే శక్తి మొక్కకు పెరుగుతుందని బీసీటీ కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్ తెలిపారు.

ఆకట్టుకుంటున్న విద్యుత్ సెట్టింగ్‌లు



దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ సెట్టింగ్

ఎలమంచిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పంచరాత్రుల మహోత్సవాలు సందర్భంగా పురవీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ భారీ సెట్టింగ్‌లు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. తులసీనగర్ ప్రధాన ద్వారం వద్ద, దిమిలి రోడ్డు జంక్షన్ల వద్ద ఏర్పాటు చేసిన దేవతామూర్తుల విద్యుత్ సెట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మవారి ఆలయం చుట్టూ ఆలయ అలంకరణలో ప్రత్యేకంగా వేసిన సెట్‌లు మరింత ఆకర్షణగా నిలుస్తున్నాయి.

మిగులు స్థలాలను పేదలకు ఇవ్వాలి

మండల సర్వసభ్య సమావేశంలో నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి డిమాండ్



మిగులు స్థలాలపై మాట్లాడుతున్న కొప్పిశెట్టి బుజ్జి

నక్కపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలో వున్న మిగులు స్థలాలను అర్హులైన పేదలకు ఇవ్వాలని నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ అధ్యక్షత జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక గ్రామాల్లో డబ్బు, భవనాలు భూములున్న వారికి, పార్టీ కార్యకర్తలకే జగనన్న లేఅవుట్ల కేటాయించారని ఆరోపించారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ మాట్లాడుతూ నక్కపల్లిలో అర్హులైన వారికి పార్టీలకతీతంగా స్థలాలను ఇచ్చామన్నారు. గతంలో అనిత ఎమ్మెల్యేగా వున్నప్పుడు సారిపల్లివానిపాలెంలో విలేకర్లకు ఇచ్చిన ఇళ్ల స్థలాల పత్రాలను కూడా మళ్లీ వెనక్కి తీసేసుకున్నారని, వారికి న్యాయం చేయాలని బుజ్జి కోరారు. వేంపాడు ఎంపీటీసీ సభ్యుడు కుంచె మధు మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధించి కార్యకలాపాల్లో కొన్నిచోట్ల దళారుల ప్రమేయం కనబడుతోందని ఆరోపించగా.. తహశీల్దార్ నర్సింహమూర్తి జోక్యం చేసుకొని అలాంటివి ఏమైనా వుంటే తన దృష్టికి తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. కోటవురట్ల మండలం గొట్టివాడ పైలట్ ప్రాజెక్ట్ వద్ద తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతుందని, దీనివల్ల నిరంతరం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కొప్పిశెట్టి బుజ్జి చెప్పారు. సభ్యులు ఆకేటి గోవిందరావు, పొడగట్ల వెంకటేశ్, బచ్చలరాజు పలు సమస్యలు గురించి ప్రస్తావించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారిణి విజయ, ఎంపీడీవో సీతారామరాజు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు పాల్గొన్నారు.

హరిపురం నుంచి మార్టూరుకు వందడుగుల రోడ్డు

- రైతులతో సమావేశమైన అధికారులు



భూముల రైతులతో మాట్లాడుతున్న అధికారులు

అచ్యుతాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి మండలం హరిపురం నుంచి అచ్యుతాపురం మండలం వెదురువాడ మీదుగా మార్టూరు వరకు వందడుగుల రోడ్డు నిర్మించనున్నారు. ఇందుకోసం వెదురువాడ సచివాలయంలో అధికారులు గురువారం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రత్యేక ఆర్థిక మండలి కారణంగా రోడ్లు విస్తరించాల్సి ఉందని, ఇందుకు రైతులు సహకరించాలన్నారు. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ భూనిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశామన్నారు. అలాగే ఎలమంచిలి వైపు నుంచి వచ్చే వాహనాలు అచ్యుతాపురం జంక్షన్ మీదుగా రాకుండా హరిపురం నుంచి వెదురువాడ, మార్టూరు మీదుగా సెజ్ ప్రధాన రోడ్డు వరకు వంద అడుగుల వెడల్పు రోడ్డు నిర్మించడానికి ప్రతిపాదనలు తయారు చేశారన్నారు. ముందుగా సర్వే జరిపి భూముల నిర్ధారణ చేస్తామన్నారు. భూనిర్వాసితులకు టీడీఆర్ బాండ్ల ద్వారా పరిహారం చెల్లిస్తామన్నారు. కాగా 2013 భూసేకరణ చట్టం ద్వారా వచ్చే పరిహారానికి టీడీఆర్ బాండ్ల ద్వారా ఇచ్చే పరిహారానికి వ్యత్యాసాలను రైతులకు అధికారులు వివరించారు. పీసీపీఐఆర్ ప్రాజెక్టు మేనేజర్ రేణుక, తహశీల్దార్ సత్యనారాయణ, డీటీ శ్యామ్ కుమార్, వీఆర్వో శశిధర్ పాల్గొన్నారు.

కొండలదేవునిపాలెం-లోవపాలెం రోడ్డుకిరువైపులా తుప్పలు తొలగించండి

రాంబిల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండలదేవునిపాలెం నుంచి వెంకయ్యపాలెం, గజిరెడ్డిపాలెం మీదుగా లోవపాలెం గ్రామాలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డులో నిత్యం ప్రజలు రాంబిల్లికి వస్తుంటారు. ఇరుకు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగిపోవడంతో మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని వాహనచోదకులు వాపోతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పించుకోవాలంటే మరింత ఇబ్బందిగా ఉంటుందన్నారు. రాత్రి వేళల్లో రోడ్డుపైకి విషసర్పాలు వస్తున్నాయని, రాకపోకలు సాగించాలంటే భయపడుతూ వెళుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అధికారులు స్పందించి తుప్పలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలను పరిశీలించిన డీఎల్‌డీవో



సబ్బవరంలో ఏర్పాటైన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీవో మంజులావాణి

సబ్బవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రతిభ విద్యాలయం, ఆర్కిడ్ స్కూల్, ప్రభుత్వ కళాశాల, గుల్లేపల్లి అక్షర పబ్లిక్ స్కూల్‌లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాలను డీఎల్‌డీవో ఎస్.మంజులావాణి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ కార్డులో తప్పుల సరిచేసుకోవడం తదితరాలకు ఈ శిబిరం ఎంతగానో దోహదపడుతుందని, అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారం రోజులపాటు ఇవి కొనసాగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, ఎంఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు



థియేటర్ సిబ్బందికి వస్త్రాలు పంపిణీ చేస్తున్న వెంకటరావు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్‌లో గురువారం హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో థియేటర్ అధినేత మళ్ల వెంకటరావు కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా థియేటర్‌లో పనిచేస్తున్న సిబ్బందికి వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రభాస్ ఫ్యాన్స్ ప్రతినిధులు జీవీఎల్ఎన్ రాజు, కాండ్రేగుల జోగేంద్ర, కొణతాల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బొజ్జన్నకొండ జంక్షన్‌లో బస్సులు ఆపాలని వినతి



డిపో మేనేజర్ హనుమశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న నాగభూషణం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం నుంచి సంక్రాంతి వరకు బొజ్జన్నకొండకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు, భక్తులు తరలి రానున్న నేపథ్యంలో బొజ్జన్న కొండ జంక్షన్ రహదారి మీదుగా రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం కోరారు. ఈ మేరకు గురువారం ఆర్టీసీ డిపో మేనేజర్ హనుమశ్రీని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఇక్కడ బస్సులు ఆపితే బొజ్జన్నకొండకు వచ్చేవారికి సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఆయన వెంట అసోసియేషన్ ప్రతినిధులు బండి అప్పారావు, బొడ్డు సోమరాజు, నాగేశ్వరరావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌కు ఏడుగురు 'డైట్' విద్యార్థుల ఎంపిక

అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు తెలిపారు. విజయనగరంలో జరిగిన ఈ ఇంటర్వ్యూల ఫలితాలు గురువారం విడుదలైనట్టు చెప్పారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్‌తో పాటు అధ్యాపక సిబ్బంది అభినందించారు.

పుస్తక మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టరు ఆవిష్కరిస్తున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి, తదితరులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఈ నెల 28 నుంచి జరగనున్న పుస్తక మహోత్సవం పోస్టర్‌ను జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి గురువారం ఇక్కడ ఆవిష్కరించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పుస్తకాలు మనిషి ఆలోచనలను విస్తరింపజేస్తాయన్నారు. పుస్తక మహోత్సవం ద్వారా విద్యార్థులు, యువత, సాహిత్య అభిమానులు విభిన్న రంగాల విజ్ఞానాన్ని పొందే అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కిరణ్, ఆర్‌వో కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి క్రీడలకు ఎంపికైన వారికి అభినందన



డివిజన్ స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో ఎంఈవోలు, హెచ్‌ఎంలు

సబ్బవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తవ్వవానిపాలెంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడల్లో సత్తాచాటి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను గురువారం ఇక్కడి ప్రభుత్వ హైస్కూల్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. త్వరలో జరగనున్న డివిజన్ స్థాయి పోటీల్లోనూ సత్తాచాటి విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడారంగం అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.తిరుపతిరావు, ఉపాధ్యాయులు ఆర్.ప్రసాదరావు, అబ్దుల్ రెహమాన్, ఎస్ఎంసీ చైర్మన్ శంకరరావు, వైస్ చైర్మన్ జ్యోతి, రత్నాలమ్మలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన

కశింకోట, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో సాంకేతిక పరిజ్ఞానంపై కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు ఐటీ, టెక్నికల్ ల్యాబ్‌లను చూపించి సాంకేతిక పరిజ్ఞానం వాస్తవ అన్వయాలు, కంప్యూటర్ నెట్‌వర్కింగ్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, డిజిటల్ టెక్నాలజీ తదితరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో పారిశ్రామిక విధానాలపై అవగాహన పెంచి, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలపై చైతన్యం కల్పించినట్టు కళాశాల అధ్యాపకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.జె.ప్రసాద్, ఉపాధ్యాయులు అప్పారావు, ఆనంద్, కాండ్రేగుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు మోక్షం ఎన్నడు?

▸▸ గవరపాలెం నుంచి పూల్‌బాగ్‌కు వెళ్లే జంక్షన్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

▸▸ పట్టించుకోని పారిశుధ్య సిబ్బంది



పూల్‌బాగ్‌కు వెళ్లే జంక్షన్‌లో నాచు పట్టిన మురుగు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గవరపాలెం నుంచి పూల్‌బాగ్‌కు వెళ్లే జంక్షన్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగు పారే మార్గం లేక రోడ్డుపై ప్రవహిస్తుంది. ఏ మాత్రం చిన్నపాటి వర్షం కురిసినా ఆయా ప్రాంతాల్లో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు నూకాంబిక ఆలయానికి వెళ్లే మార్గంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోజుల తరబడి మురుగు రోడ్డుపైనే నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. పూల్‌బాగ్‌కు వెళ్లే రోడ్డులో సైతం ఇరువైపులా డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయి. ఈ జంక్షన్ నుంచి నూకాంబిక ఆలయానికి వెళ్లాలంటే మధ్యలో విద్యాసంస్థలు, కల్యాణ మండపాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ముఖ్యంగా లోంచి రోజూ అధిక సంఖ్యలో భక్తులు ఇటుగానే నూకాంబిక అమ్మవారి దర్శనానికి వెళ్లి వస్తుంటారు. ఇంతటి ప్రధానమైన మార్గంలోని పూల్‌బాగ్ జంక్షన్ దుర్భరంగా మారడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. ఒకపక్క పట్టణంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జోనల్ కమిషనర్ చక్రవర్తి సూచనలు ఇస్తుండడమే కాకుండా ప్రతి రోజూ వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ పలువురు సిబ్బంది అలక్ష్యం కారణంగా ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

మూలస్వయంభూవరంలో...

పరవాడ : మండలంలోని కలపాక పంచాయతీ పరిధి మూలస్వయంభూవరం గ్రామస్థులను మురుగు సమస్య వీడడం లేదు. సుమారు 250 కుటుంబాలున్న ఈ గ్రామంలో నేటికీ పూర్తిస్థాయిలో కాలువల నిర్మాణం చేపట్టలేదు. ఈ కారణంగా ఇళ్లలోని వాడుకనీరంతా ప్రధాన రహదారి పైనే తిష్ట వేస్తోంది. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతుంది. మురుగంతా ప్రధాన రహదారి పైనే వచ్చి చేరడంతో అటుగా రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు పడుతున్నారు. వర్షా కాలం కావడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. మురుగుపై ఈగలు, దోమలు చేరి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని అక్కడివారంతా వాపోతున్నారు. కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల బాధలను అర్థం చేసుకొని ఇప్పటికైనా గ్రామంలో కాలువలు నిర్మాణం చేపట్టి మురుగు నుంచి విముక్తి కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మూలస్వయంభూవరం రహదారిపై నిల్వ ఉన్న మురుగునీరు



జంక్షన్‌లో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ



నూకాంబిక ఆలయానికి వెళ్లే మార్గంలో...

కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్ జగన్‌రెడ్డి

▸▸ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ 'పీలా' ▸▸ కుంభకోణానికి పాల్పడిన వారిని వదిలేది లేదని హెచ్చరిక



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా

తుమ్మపాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్ జగన్‌రెడ్డి అని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. అనకాపల్లిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్తీ మద్యం, గంజాయిని అరికట్టడానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కల్తీ మద్యాన్ని అరికట్టేందుకే సురక్ష యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. వైసీపీ పాలనలో కల్తీ మద్యం సొమ్ములన్నీ తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయని ఆరోపించారు. కల్తీ మద్యం కుంభకోణానికి సంబంధించిన వ్యక్తులు ఎంతటి వారైనా ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే తమ లక్ష్యంగా పేర్కొన్నారు. అనంతరం ఇటీవల నియోజకవర్గంలో నియమితులైన పీఏసీఎస్‌ల చైర్‌పర్సన్లు, డైరెక్టర్లను ఆయన అభినందించారు. దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, కశింకోట మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు, నాయకుడు మాదంశెట్టి నీలబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

అనకాపల్లి టౌన్ : మహిళల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఇక్కడి వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపంలో గురువారం జీవీఎంసీ యూసీడీ, మెప్మా ఆధ్వర్యంలో 35 ఏళ్లు నిండిన స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు 'సఖీ సురక్ష' పేరిట ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన పీలా వైద్య పరీక్షల తీరును పరిశీలించిన అనంతరం మాట్లాడారు. గతంలో జగన్ ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికిందని, కూటమి తిరిగి అధికారంలోకి రావడంతో మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని చెప్పారు. ఈ శిబిరంలో పదిహేను రకాల స్క్రీనింగ్ పరీక్షలను 301 మందికి జరిపారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, 84వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు, మెప్మా ఏపీడీ వై.సంతోష్ కుమార్, వైద్యులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏకోపాధ్యాయుల సమస్యలపై వినతి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏకోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ అనకాపల్లి మండల శాఖ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంఈవో కోటేశ్వరరావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు మామిడి బాబూరావు మాట్లాడుతూ ఏకోపాధ్యాయులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. సెలవు పెట్టడానికి కూడా అధికారులను వేడుకోవాల్సి వస్తోందన్నారు. మండలంలో ఉండే మిగులు ఉపాధ్యాయులను గుర్తించి ఏకోపాధ్యాయులు సెలవు పెట్టిన రోజున వారిస్థానంలో డిప్యూటేషన్‌పై సదరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. సీఆర్ఎంటీలను విద్యాశాఖ అధికారి కార్యాలయంలోనే ఉంచుకోవడం సరికాదన్నారు. ఎంఈవోను కలిసిన వారిలో ఫెడరేషన్ నాయకులు జీఎస్ ప్రకాష్, సత్యవేణి, జగన్నాథం, రాము, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన న్యాయమూర్తిపై దాడి సిగ్గుచేటు

ప్రధాని మోదీ స్పందించకపోవడం దారుణం

అఖిలపక్ష నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

తుమ్మపాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మం పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడికి పాల్పడటం సిగ్గుచేటని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో గురువారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి ఇంత వరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించకపోవడం దారుణమన్నారు. మతం పేరుతో ఆర్ఎస్ఎస్ ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ ఉత్సవాలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి హాజరు కాకపోవడమే ఈ ఘటనకు కారణమని అభిప్రాయపడ్డారు. తక్షణమే న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.శంకరరావు, రైతు కూలీ సంఘం ప్రధానకార్యదర్శి కె.మోహన్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కొణతాల హరినాథబాబు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి బి.పరమేశ్వరి, సీపీఐ నాయకులు వియ్యపు రాజు, విత్తనాల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో రహదారులు జలమయం



తుమ్మపాల మెయిన్‌రోడ్డుపై నిలిచిపోయిన వర్షపునీరు

తుమ్మపాల/కొత్తూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా అనకాపల్లి మండలంలో గురువారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. రాకపోకలకు జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల డ్రైనేజీల నుంచి నీరు బయట ప్రవహిస్తోంది. పల్లె రోడ్లు చిత్తడిగా మారడంతో వాహనదారుల అవస్థలు పడుతున్నారు. తుమ్మపాల చినబాబుకాలనీ వద్ద మెయిన్ రోడ్డు వర్షపు నీటితో చెరువును తలపిస్తుంది. తుమ్మపాల మెయిన్ రోడ్డు నుంచి బొజ్జన్నకొండ మలుపు వద్ద ఏర్పడిన భారీ గోతుల్లో నీరు చేరి రాకపోకలు సాగించేవారు తీవ్ర అవస్థలు పడ్డారు. అలాగే వెంకుపాలెం జంక్షన్, దిబ్బపాలెం జంక్షన్‌లు పూర్తిగా జలమయమయ్యాయి. కొత్తూరులోని పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ వర్షంపు నీరు నిలచిపోయింది.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంతకా పల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అంతకా పల్లి, గొటివాడ, గాలిభీమవరం, నారనమ్మపాలెం, వంగలి, రాయపురఅగ్రహారం, ఆరిపాక, లగిశెట్టిపాలెం, యాతపాలెం, బంగారమ్మపాలెం, అడ్డూరు గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెదముషిడివాడ సబ్ స్టేషన్ పరిధిలో..

లంకెలపాలెం : పెదముషిడివాడ సబ్‌స్టేషన్ నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా లంకెలపాలెం, శ్రీరామ్‌నగర్, గంగిరెడ్ల కాలనీ, వినాయకనగర్, గెంజిపేట, గొల్లపేట, ఇండస్ట్రియల్ ఏరియా, శ్రీరంగనగర్, పెదముషిడివాడ, నక్కవానిపాలెం, పచ్చికోరువానిపాలెం, గండివానిపాలెం, విజయరాంపురం, మార్కండేయనగర్, కన్నూరు, మంత్రిపాలెం, మడకపాలెం గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలన్నారు.

ఎంపీ రమేశ్‌ను సత్కరించిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రవి



ఎంపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న పలకా రవి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి) : బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన పలకా రవి గురువారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ను సత్కరించారు. ఇక్కడి జాతీయ రహదారిలోని ఎంపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావుతో వెళ్లి ఎంపీని మర్యాద పూర్వకంగా కలిశారు. తనను జిల్లా ఉపాధ్యక్ష పదవికి ఎంపిక చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు సుభాని ఎంపిక



అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్ర స్థాయి అండర్ -17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు స్థానిక జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ సుభాని విశాఖ జిల్లా తరపున పాల్గొననున్నాడని ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మాజీ తెలిపారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జడ్పీ హైస్కూల్‌లో ఈనెల 24 నుంచి 26 వరకు ఈ పోటీలను జరగనున్నాయి. ఈ సందర్భంగా సదరు విద్యార్థిని ఉపా ధ్యాయులంతా అభినందించారు.

నేడు పరవాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పరవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నామని ఎంపీడీవో బి.రమేష్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్టు చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

తాళ్లపాలెంలో విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి

కశింకోట, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెంలో విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. వాతావరణంలో మార్పుల కారణంగా ఉరుములు, మెరుపులతో గురువారం భారీ వర్షం కురిసింది. అదే సమయంలో గ్రామానికి చెందిన దోమాధుల ఆదిలక్ష్మికి చెందిన ఆవు కట్టి ఉన్న ప్రదేశంలో చెట్టు కొమ్మలు తెగి పడి విద్యుత్ వైర్లపై పడడంతో అవి తెగి అక్కడే గడ్డి మేస్తున్న ఆవుపై పడ్డాయి. దీంతో అది అక్కడికక్కడే మృతిచెందింది. తమకు జీవనాధారంగా ఉన్న గోవు మృతిచెందడంతో ఆ కుటుంబం విలపిస్తోంది. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

'ఆరోగ్యశ్రీ పథకం నిధులను వెంటనే విడుదల చేయాలి'

పరవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యశ్రీ పథకం నిధులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గసభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నెట్‌వర్కు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు బంద్ కావడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్యవసర సేవలు కూడా నిలిచిపోవడంతో రోగులు అయోమయ స్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆరోగ్యశ్రీ సేవలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కర్రి పోతునాయుడు, పి.చిన్నారావు, వై.వెంకటరమణ, ఎస్.అప్పలరాజు, కొల్లు రాము, ధూళి దేముడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడితో గిడ్డి ఈశ్వరి భేటీ



పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఈశ్వరి

పాడేరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆ పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి గురువారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ బలోపేతం, ప్రభుత్వం కార్యక్రమాలు, తదితర అంశాలపై చర్చించారు.

గ్రామ దేవతల ఆలయాల పరిరక్షణే ధ్యేయం



దానధర్మ చారిటబుల్ ట్రస్టు ఆద్వర్యంలో పూజా సామగ్రిని అందిస్తున్న ప్రసాద్

కొయ్యూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవతల ఆలయాలలో నిత్యం ధూప, దీప నైవేద్యాలు జరిగేలా చూడడమే దానధర్మ చారిటబుల్ ట్రస్టు ప్రధాన ఉద్దేశమని ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి ప్రసాద్ పేర్కొన్నారు. కార్తీకమాసం పురస్కరించుకుని మండలంలో గల పలు దేవాలయాలకు ట్రస్టు సమకూర్చిన పూజా సామగ్రిని ప్రసాద్ గురువారం రావణాపల్లిలో ఆ లయ పూజారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గల 300 పైగా ఉన్న దేవాయాలకు కార్తీక మాసం పురస్కరించి ట్రస్టు ద్వారా ధూప, దీప, నైవేద్య సామగ్ని అందచేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంగతల్లి, బీజేపీ మండల అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, పద్మరాజు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: ఎస్ఐ



డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ సురేశ్

పాడేరురూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను తరలించే ప్రైవేటు జీపు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని స్థానిక ఎస్ఐ ఎల్.సురేశ్ సూచించారు. గురువారం ఆయన ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని జీపుల స్టాండ్ వద్ద డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. పాడేరు నుంచి చోడవరం, జి.మాడుగుల, అరకులోయ, ముంచంగిపుట్టు, పెదబయలు వైపు వెళ్లే డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణకులను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాంగ్ పార్కింగ్‌లో వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దన్నారు.వంజంగి, కొత్తపల్లి, లంబసింగి, అరకువేలి తదితర పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులను తరలించే వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వారికి ఇబ్బందులు కలగకుండా, రోడ్డు ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు వ్యవహరించాలన్నారు.

వాహన తనిఖీలు

గూడెంకొత్తవీధి: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక సీఐ వర ప్రసాద్ అన్నారు. గురువారం రోడ్డు ప్రమాదం జరిగిన రింతాడ మాలీవీధిని సందర్శించారు. ఈసందర్భంగా స్థానిక గిరిజనులు, వాహన చోదకులతో ఆయన మాట్లాడుతూ సర్వీసు, ప్రైవేటు వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలు ఫిట్‌నెస్‌తోపాటూ వాహనాలకు సంబంధించిన సీబుక్, ఇన్సూరెన్సు కలిగి ఉండాలన్నారు. వాహనాలు అతివేగంగా ప్రయాణించరాదన్నారు. కార్యక్రమంలో ఎస్సై సురేశ్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సహాయం



బాధితుని కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న నాయకులు

జి.మాడుగుల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఉపాధికోసం భీమవరం వెళ్లి విద్యుదాఘాతానికి లోనై మృతి చెందిన బుటారి సంజీవరావు కుటుంబానికి మద్దిగరువు ప్రాంతానికి చెందిన ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు గురువారం సర్పంచ్ ఆ ధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. మృతుడు కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. గత నాలుగేళ్లుగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు వెల్లడించారు.

ఎర్ర ముల్లంగి సాగుపై మొగ్గు

» మార్కెట్‌లో ధర ఆశాజనకం

దుంబ్రిగుడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో గిరిజన రైతులు ఈ ఏడాది కొత్తరకం ఎర్ర ముల్లంగి సాగుపై మక్కువ చూపుతున్నారు. ఒడిశా రాష్ట్రానికి ఆనుకుని ఉన్న గ్రామాల గిరిజనులకు ఈ పంట బాగా



తెలుపు రంగులో ముల్లంగి దుంపలు



ఎర్ర రంగులోని ముల్లంగి

దిగుబడి వస్తోంది. స్థానిక గిరిజనులూ ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో ఎర్ర ముల్లంగి కావడి రూ. వెయ్యి ధరకు విక్రయిస్తుండగా, తెల్ల ముల్లంగి కావిడి రూ. 500నుంచి రూ. 700 వరకు వస్తోంది. ఎర్ర ముల్లంగి సాగుతో అధికలాభాలు వస్తున్నట్టు గిరిజనులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

ఒనకఢిల్లీలో విదేశీయులు సందడి



వారపుసంతలోని సందడి చేస్తున్న విదేశీయులు

ముంచంగిపుట్టు, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర- ఒడిశా సరిహద్దు మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలోని ఒనకఢిల్లీ వారపు సంతలో గురువారం విదేశీయులు సందడి చేశారు. ఆస్ట్రేలియా, దక్షణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ దేశాలకు చెందిన సుమారు 40 మంది పర్యాటకులు మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం వారపు సంతలో బోండ, గదబ గిరిజనులతో ముచ్చటించారు. గిరిజనుల వస్త్రాలను ధరించి, బోండ గిరిజనులు విక్రయిస్తున్న పూసలను కొనుగోలు చేశారు. వారి సంప్రదాయాలను గైడ్‌ను అడిగితెలుసుకున్నారు.

తల్లి మృతితో తల్లడిల్లి..

ధారకొండకు చెందిన విద్యార్థి ఆత్మహత్య



నిఖిల్ (ఫైల్)

సీలేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ధారకొండకు చెందిన విద్యార్థి నిఖిల్ విశాఖలో ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో ధారకొండలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలివి.. గ్రామానికి కాలంకున్నత్ సునీల్, రేవతి దంపతులు పిల్లల చదువుల నిమిత్తం విశాఖలో ఉంటున్నారు. అయితే, నాలుగు నెలల క్రితం రేవతి గుండెపోటుతో మృతి చెందారు. దీంతో కుటుంబమంతా అప్పటి నుంచి విషాదంలో ఉంది. తల్లి అంటే కుమారుడు నిఖిల్‌కు అత్యంత ప్రేమ. దీంతో ఆమె మరణాన్ని జీర్ణించుకోలేకపోయాడు. గురువారం నిఖిల్ తన తల్లి రేవతికి బహుమతిగా ఇచ్చినచీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్య చేసుకున్న సమయంలో తల్లి ఫొటో నిఖిల్ చేతిలో ఉంది. నిఖిల్ ప్రస్తుతం విశాఖలో పాలిటెక్నికల్ చదువుతున్నారు. నిఖిల్ మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే ధారకొండ వాసులు విశాఖ బయలుదేరి వెళ్లారు.

మెరుగైన వైద్యమందించాలి: డీఎంహెచ్‌వో

దుంబ్రిగూడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేసి, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో బి. క్రిష్ణమూర్తి నాయక్ అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజు వారి రికార్డులను తనిఖీ చేశారు. వార్డులో బాలింతలతో మాట్లాడారు. మాతా శిశు మరణాలు లేకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణపై నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించబోనన్నారు. ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దుంబ్రిగూడలో బాలింతలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కృష్ణమూర్తి

మలేరియా కేసులపై ఆరా...

పాడేరురూరల్:పాడేరులోని జిల్లా మలేరియా కార్యాలయాన్ని డీఎంహెచ్‌వో డి.కృష్ణమూర్తి నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడి, జిల్లాలోని పీహెచ్‌సీల వారీగా ఈ ఏడాది మలేరియా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాదితో పొల్చుకుంటే ఈ ఏడాది పాడేరు డివిజన్‌లోని 3 పీహెచ్‌సీల పరిధిలో, రంపచోడవరం డివిజన్‌లో 9 పీహెచ్‌సీలు, చింతూరు డివిజన్ పరిధిలోని 6 పీహెచ్‌సీల పరిధిలో మలేరియా కేసుల నమోదు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. గ్రామాల్లో నమోదైన మలేరియా రోగులకు అందించిన ఆర్‌టీ చికిత్స వివరాలు, చేపట్టిన యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చర్యల వివరాల నివేదికలను డీఎంహెచ్‌వో కార్యాలయానికి అందజేయాలని జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్.తులసీకి ఆదేశించారు. వీబీడీ కన్సల్టెంట్, ఆరోగ్య విస్తరణాధికారి కీటక జనిత వ్యాధుల నివారణ చర్యల వివరాలనూ అందించాలన్నారు.

గిరిజన యువకుడి మృతి



దిబ్బనరావు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు

కొయ్యూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బూదరాళ్ల పంచాయతీ చీడిపల్లికి చెందిన గిరిజన యువకుడు కిముడు దిబ్బనరావు (28) శరీర అవయవాలు వాపులతో బాధపడుతూ మృతి చెందారు. గ్రామస్థులు అందచేసిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం నుంచి దిబ్బనరావు కాళ్లు, వాపులు రావటం ప్రారంభమై బుధవారం ఉదయానికి చేతులు, ఇతర శరీర అవయవాలకు వ్యాపించింది. పరిస్థితి విషమంగా మారడంతో ఆయనను కుటుం బసభ్యులకు వైద్య సేవలకు తరలించే ప్రయత్నం చేస్తుండగా మరణించాడు. రోజుల వ్యవధిలో దిబ్బనరావు ఆరోగ్య పరిస్థితిలో అనూహ్య మార్పు వచ్చి మృత్యువాత పడటంతో చీడిపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతునికి భార్య కాంతమ్మ, కుమారుడు వసంతకుమార్ (12) ఐదేళ్ల సంధ్యతోపాటు మరో ఏడాది కూతురు ఉన్నారు. దిబ్బనరావు అకాల మృతితో కుటుంబం వీధినపడింది.

నవ ధాన్యాల సాగు- నేలతల్లికి బాగు



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న ఏవో వరప్రసాద్

జి.మాడుగుల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతాంగం చిరుధాన్యాల సాగుపై దృష్టి చారించాలని స్థానిక వ్యవసాయ అధికారి వరప్రసాద్ సూచించారు. మండలంలోని గురువారం నుర్మతి రైతు సేవా కేంద్రంలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంతరించుకుపోతున్న చిరుధాన్యాల పంటలపై గిరిజనులు దృష్టి సారించాలని సూచించారు. నవధాన్యాల సాగు-నేల తల్లికి బాగు అనే కార్యక్రమంలో భాగంగా సామూహిక కషాయాల తయారీ, ప్రకృతి సాగులో ఉద్యాన పం టలు, పెరటి తోటలు పెంచే విధానంపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూరిబాబు, సిబ్బంది ప్రశాంత్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ కార్మికుల సమస్యపై నిర్లక్ష్యం

» ఏఐటీయూసీ నాయకుడు అమర్



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు అమర్

జి.మాడుగుల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పెట్రోల్ బంకులో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం ప్రదర్శించడం తగదని ఏఐటీయూసీ కన్వీనర్ అమర్ అన్నారు. స్థానిక బంకు వద్ద కార్మికులతో కలసి ఆయన మాటాడారు. ఏళ్ల తరబడి బంక్‌లో పనిచేస్తున్నా కార్మికుల జీతాలు పెంచడం లేదన్నారు. వారికి సంబంధించి జీవోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల 12 గంటల శ్రమను దోచుకుంటున్నారన్నారు. జీసీసీ ,ఐటీడీఏ బంకుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఉద్యోగ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శివ,నాయకులు శంకర్, మత్స్యరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీఐకు సన్మానం



సీఐ వర ప్రసాద్‌ని సన్మానిస్తున్న సీఆర్‌పీఎఫ్ , సివిల్ పోలీసులు

గూడెంకొత్త వీధి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వర ప్రసాద్‌ని విశాఖపట్నం బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీచేశారు. ఏడాదిన్నర గా ఇక్కడ ఆయన సేవలందిస్తున్నారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు. కాగా బదిలీ అయిన సీఐని గురువారం సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఏకే దాస్, సివిల్ ఎస్సై కె. సురేశ్ కుమార్, పోలీసులు ఘనంగా సన్మానించారు. గిరిజన ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షణకు ప్రత్యేక కృషి చేశారని కొనియాడారు.

స్వీయ రక్షణకు కరాటే అవసరం



సెల్ఫ్ డిఫెన్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

కొయ్యూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళల స్వీయ రక్షణకు కరాటే నేర్చుకోవటం అవసరమని పాండు కరాటే అకాడమీ ఇంటర్ నేషనల్ కోషుకాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ పాండురా జు పేర్కొన్నారు. గురు వా రం మండలంలో మర్రిపాలెం మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు పీఎం ఉష అండర్ గెల్ స్కీమ్ ద్వారా 30 రోజుల పాటు నిర్వహించనున్న సెల్ఫ్ డిఫెన్సు శిక్షణను ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాండు రాజు మాట్లాడుతూ విద్యార్థినుల స్వీయ రక్షణకు ఈ శిక్షణ దోహద పడుతుందన్నారు. ఈ శిక్షణను పాడేరు, చింతపల్లి అరకువేలీ డిగ్రీ కళాశాలల్లో అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. సుధ, వైస్ ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, కరాటే ఇన్‌స్ట్రక్టర్ సూర్య ప్రకాష్, పీడీ లక్ష్మి రమణమ్మ, కళాశాల సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ధారాలమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ. 7. 4 లక్షలు

సీలేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలంలోని ధారాలమ్మ ఆలయంలో గురువారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఎండోన్‌మెంట్ కార్యనిర్వాహ ణాధికారి సాంబశివరావు, గ్రామస్తుల ఆద్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఐదు నెలలకు గాను రూ. 7,40,192 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో సాంబశివరావు ఈ సందర్భంగా తెలిపారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు పోతురాజు గోవింద్, పోతురాజు కృష్ణ, గడుతూరి చిన్నారావు, బైశెట్టి సుందరరావు, సీపీఐ నేత సుంకర విష్ణుమూర్తి, మోహనరావు, చీర్ల రమేశ్, మత్స్యరాస కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా గంజాయి నిర్మూలన సాధ్యం: ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ పాపినాయుడు

దుంబ్రిగూడ. అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సమిష్టితోనే గంజాయి నిర్మూలన సాధ్యపడుతుందని, అందుకూ ప్రజా ప్రతినిధులు, పెద్దలు, ప్రజలు భాగస్వాములు కావాలని ఎస్ఐ పాపినాయుడు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కించుమండ పంచాయితీ కేంద్రంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో పరివర్తాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజాయి సాగును వీడనాడి ప్రత్యమ్నయ పంటల సాగుకు ఉతమిస్తే ఆదాయాన్ని పెంపొందిచుకోవచ్చన్నారు. యువత గంజాయి రవాణాకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రంలో సర్పంచ్ చెల్లమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు విజయ, విజయ్‌కుమార్, అర్జున్, చిరంజీవి పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

జి.మాడుగుల : పోక్సో చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు అన్నారు. గురువారం స్థానిక గురుకుల కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యసనాలకు లోనుకాకుండా కాకుండా మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. రాంగింగ్ దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ మద్యం నిరోధానికే క్యూఆర్ కోడ్ అమలు



పాడేరులో మద్యం షాపులో క్యూఆర్‌కోడ్‌లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పాడేరురూరల్, అర్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ డప్పోడి వెంకటరమణ నాయకులతో కలిసి గురువారం పట్టణంలోని మద్యం షాపులను ఆకస్మికంగా సందర్శించారు. నకిలీ మద్యం అమ్మకాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం షాపుల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేపట్టిన తరువాతే మద్యం బాటిల్స్ అమ్మకాలు చేపట్టాలని కోరారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఒక వ్యక్తికి మూడు మద్యం బాటిల్స్‌ను మాత్రమే విక్రయించాలని యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్.కొండబాబు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేకుల షెడ్‌లో పాఠశాల.. చిన్నారుల అవస్థలు



బంధవీధిలో రేకుషెడ్‌లో చదువుతున్న చిన్నారులు

సీలేరు, అక్టోబరు 23 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని బంధవీధి గ్రామంలో పాఠశాలకు పక్కా భవనం మంజూరు చేయాలనిగ్రామానికి చెందిన పీవీటీ తెగకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరారు. గ్రామంలోని యూపీ పాఠశాలలో 50 మంది వరకు విద్యార్థులు చదుకుంటున్నారన్నారు. పాఠశాల భవనం లేకపోవడంతో గ్రామంలో రేకులతో ఒక పాకను నిర్మించామన్నారు. సంవత్సరాల తరబడి ఈ పాకలోనే విద్యార్థులకు బోధన సాగుతుందన్నారు. కానీ, అధికారులు మాత్రం పాఠశాల భవనం నిర్మించలేదని ఆరోపించారు. వర్షాకాలం కావడంతో పిల్లల చదువుకు అంతరాయం నెలకొంటొందన్నారు. ఇటీవల ప్రభుత్వం ఉపాధ్యాయుడిని నియమించారని, పాఠశాల భవనం మంజూరు చేసి విద్యార్థుల కష్టాలు తీర్చాలని అధికారులను కోరారు.

ముగిసిన డివిజన్ స్థాయి క్రీడా పోటీలు



హైజంప్‌లో పాల్గొన్న విద్యార్థిని

పాడేరురూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆద్వర్యంలో గత రెండు రోజులుగా పాడేరులో నిర్వహించిన అండర్ 14, 17 బాల బాలికల క్రీడా పోటీలు గురువారంతో ముగిసినట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పాంగి సూరిబాబు తెలిపారు. గురువారం నిర్వహించిన 800 మీటర్లు పరుగు పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.జగన్మోహనరావు ప్రారంభించారన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడా పోటీలకు పంపించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎస్.విశ్వ ప్రసాద్, టి.నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ వండ్లం కొండబాబు, జిల్లా పీడీ, పీఈటీల అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ భూపతిరాజు, చందరరావు, సద్దు, ఎస్.సింహాచలం, మన్మధరావు, సత్యవతి పాల్గొన్నారు.

ర్యాలీలపై పోలీసు ఆంక్షలు : డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ షహబాజ్ అహమ్మద్

పాడేరురూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు ఈ నెల 24వ తేదీ శుక్రవారం భారత్ బంద్‌కు పిలుపు నిచ్చిన నేపథ్యంలో పాడేరు డివిజన్‌లో ర్యాలీలు, ముట్టడి తదితర నిరసనలపై పోలీసు ఆంక్షలను అమలు చేస్తున్న ట్టు డీఎస్పీ షేక్ షహబాజ్ అహ మ్మద్ స్పష్టం చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎవరైనా శుక్రవారం ర్యాలీలు, నిరసనలు చేపట్టదలస్తే వంద మందికి మించకుండా చేసుకోవాలని సూచించారు. ప్రజా భద్రత దృష్ట్యా ఎక్కువ మందికి అనుమతించమని తెలిపారు. వీటిని ఉల్లంఘించి ఎక్కువ మందితో నిరసనలు, ర్యాలీలు చేసిన, ప్రజా రవాణాకు ఆటంకం కలిగించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ డి.దీనబందు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ ఆనంద్

చింతపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్థానిక ఆర్ఐటీఐ సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ కోడా ఆనంద్ అన్నారు. గురువారం స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ఆర్ఐటీఐని సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థినులకు ఐటీఐలో అందుబాటులోనున్న కోర్సులు, వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు అందిస్తున్న పారిశ్రామిక శిక్షణను ఇన్‌స్ట్రక్టర్లు వివరించారు. ఈసందర్భంగా సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఐటీఐ, పాలిటెక్నిక్, ఒకేషనల్ ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్ చేయడంతో పారిశ్రామిక రంగాల్లో ఉద్యోగాలు అవకాశాలు లభిస్తాయన్నారు. స్వయం ఉపాధి సైతం పొందవచ్చునన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బీఎస్ఎన్ పడాల్, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద సమ్మె చేస్తున్న ఆస్పత్రి పారిశుధ్య కార్మికులు

పాడేరురూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎల్.సుందరరావు హెచ్చరించారు. నెలరోజులుగా సమస్యలపై వినతిపత్రాలందించినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం కార్మికులు సమ్మె బాట పట్టారన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి కార్మికులకు 2024 నవంబరులో విడుదల చేసిన కొత్త వేతన జీవోను అమలు చేసి ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. డ్యూటీ చార్ట్ ఇవ్వాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐలో జరిగిన తప్పిదాలను సరిచేయాలనికోరారు. కార్యక్రమంలో కొత్త ఆసుపత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాల కార్మికులు ముత్యాలమ్మ, పుణ్యవతి, రత్నాలమ్మ, సుజాత, రాజేశ్వరి, భూషణ్, చిట్టిబాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు'



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటరమణ

మాకవరపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రేషన్ కార్డులను అందరికీ అందజేయాలని తహశీల్దార్ బి.వెంకటరమణ రేషన్ డీలర్లకు ఆదేశించారు. గురువారం ఇక్కడ ఏర్పాటైన డీలర్ల సమావేశంలో మాట్లాడారు. మండలానికి కొత్తగా 18వేల స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చినట్టు చెప్పారు. అర్హులందరికీ వీటిని అందించాలని, అలాగే ఇంకా ఎంతమందికి ఈ కార్డులు రాలేదో గుర్తించి ఆ వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వచ్చే నెల నుంచి ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు రేషన్ షాపులు తెరచి ఉంచాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో నిత్యాన్నదానం

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని ఎనిమిదో వార్డు రామారావుపేటలో ఉన్న జనసేన కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పంచాడ హరినాథ్ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం జన సేన నియోజకవర్గ ఇన్‌చార్జి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర హాజరై పేదలకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అల్లాడ సురేష్, నాయకులు మాకిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై కేసు

» ప్రజలంతా స్నేహభావంతో మెలగాలి » తాడపాల గ్రామ సభలో డీఎస్పీ శ్రీనివాసరావు

మాకవరపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని తాడపాల గ్రామంలో గురువారం స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ధ్వంసం ఘటనపై విచారణ నిమిత్తం విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పల్లెల్లో అంతా స్నేహభావంతో కలసి మెలసి ఉంటే ప్రశాంత వాతావరణం నెల కొంటుందన్నారు. ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ప్రస్తుతం విగ్రహం ధ్వసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఇకపై గ్రామంలో తగాదాలు ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. అనంతరం విగ్రహం ధ్వంసం చేసిన ప్రదేశంలో కొత్తగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐ రేవతమ్మ, ఎస్ఐ దామోదరనాయుడు పాల్గొన్నారు.



తాడపాలలో గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నడపాలని ఆందోళన



ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

నర్సీపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కొత్త మెడికల్ కళాశాలలు పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేయకుండా, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నడపాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బోను కృష్ణ డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ఇవ్వడాన్ని నిరసిస్తూ గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త విధానం వలన అత్యధికంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. పీపీపీ విధానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరారు. అలాగే, అసంపూర్తిగా ఉన్న మాకవరపాలెంలోని మెడికల్ కళాశాల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులను అంతా ప్రోత్సహించాలి

» అత్మనిర్భర్ భారత్ జిల్లా కన్వీనర్ రవిరాజు

నర్సీపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విదేశీ వస్తువులను కాకుండా స్వదేశీ వస్తువులనే వాడాలని అత్మనిర్బర్ భారత్ జిల్లా కన్వీనర్ రవిరాజు పిలుపునిచ్చారు. నర్సీపట్నం, నగరం గ్రామంలో గురువారం అత్మనిర్బర్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వదేశీ వస్తువులు వాడటం వలన జీడీపీ రేటు పెరిగి దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ విషయంలో విద్యావంతులంతా నిరక్షరాస్యులను చైతన్య వంతులను చేయాలన్నారు. విదేశీ వస్తువులను అంతా విడనాడాలని పునరుద్ఘాటించారు. దేశాభివృద్ధిలో అందరూ కంకణబద్ధులై భావితరాల వారికి స్ఫూర్తిగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ కిల్లాడ సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు బోళెం అప్పనదొర, రూరల్ కన్వీనర్ శ్రీనివాస్ తదితరులతో పాటు ఆయా ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గణేశ్‌కు సన్మానం



గణేశ్‌కు చిత్రపటం అందిస్తున్న నాయకులు

నాతవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలానికి పార్టీ మేధావుల విభాగం అధ్యక్షుడిగా ఆయిల్‌పామ్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు పైల పోతురాజును నియమించడంపై వైసీపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్‌ను గురువారం సత్కరించారు. జడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, గొర్లి వరహాలబాబు, పైల సునీల్, కరక అప్పలరాజు, సర్పంచ్ గొలగాని పాల్గొన్నారు.

మూడు మండలాల్లో భారీ వర్షం



నర్సీపట్నం మండలం ఓఎల్‌పురంలో వర్షం కురుస్తున్న దృశ్యం



గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెంలో...

నర్సీపట్నం అర్బన్/ నాతవరం/గొలుగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం ప్రభావంతో గురువారం నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ మండలాల్లో వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గ్రామీణ ప్రాంత రహదారులు చిత్తడిగా మారాయి. ఈ కారణం నర్సీపట్నం మండలం ఓఎల్‌పురం, చెట్టుపల్లి, వేములపూడి, పెదబొడ్డేపల్లి, కేఎల్‌పురం, నీలంపేట, గబ్బాడ, నాతవరం మండలం నాతవరం, చమ్మచింత, జిల్లేడిపూడి, తాండవ తదితర గ్రామాలతో పాటు గొలుగొండ మండలంలోని జోగంపేట, పాకలపాడు, చీడిగుమ్మల, పప్పుశెట్టిపాలెం, ఏటిగైరంపేట, గుండుపాల, కొత్తమల్లంపేట, ఏఎల్‌పురం తదితర గ్రామాల్లో రాకపోకలకు జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే, శుక్రవారం వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. నాతవరం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

8, 9 తేదీల్లో ఆశ వర్కర్ల రాష్ట్ర మహాసభలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్యకర్తలు

చోడవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో వచ్చే నవంబరు నెల 8, 9 తేదీలలో జరిగే ఆశ కార్యకర్తల రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కురచా వరలక్ష్మి విజ్ఞప్తి చేశారు. మహాసభల పోస్టర్‌ను గురువారం ఆమె స్థానిక కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆశ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభల్లో చర్చించి పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తల సంఘం జిల్లా కమిటీ సభ్యులు తార, ద్వారపురెడ్డి అరుణ, ఆర్, సంతోషి, బొద్దాన లక్ష్మి, డి. గౌరీ తదితరులు పాల్గొన్నారు.

'సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి అమానుషం'



మాట్లాడుతున్న రిటైర్డ్ లెక్చరర్ దేముడు

చోడవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడికి పాల్పడిన ఘటనకు పూర్తి బాధ్యత బీజేపీ, దాని అనుబంధ సంస్థ ఆర్ఎస్ఎస్‌లదేనని రిటైర్డ్ లైక్చరర్, దళిత సంఘం నేత నడుపూడి దేముడు మాస్టారు ఆరోపించారు. సుప్రీం జస్టిస్‌పై దాడికి నిరసనగా స్థానిక అంబేద్కర్ భవన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్షాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోనికి వచ్చిన తరువాత, దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఈ శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, సీపీఐఎంఎల్ నేత గౌరీశంకర్ మాస్టారు. సీపీఎం నాయకులు ఎస్.వీ నాయుడు, వైసీపీ నాయకులు పుల్లేటి వెంకటేష్, ఏఐఎస్ఎఫ్‌జిల్లా నాయకులు ఫణీంద్ర, దళిత సంఘం నాయకులు వరప్రసాద్, సోమాదుల దేవి, ఎమ్మార్పీఎస్ నాయకులు ఘాటీలు, పడవల చక్రవర్తి, ముత్యాలు, కొండ, గురువులు తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని చెత్త సమస్య

» రావికమతంలో నిలిచిన పారిశుధ్య పనులు
» వీధుల్లో పేరుకుపోతున్న చెత్త



బీఎన్ రోడ్డుపై కుప్పలుగా చెత్త



ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వృథాగా ఉన్న చెత్త ట్రాక్టర్

రావికమతం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతోంది. దీంతో తీవ్ర దుర్వాసనతో గ్రామస్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. నాలుగు రోజులుగా గ్రామంలో పారిశుధ్య పనులు నిలిపివేయడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పంచాయతీకి తొలుతనుంచి చెత్త వేసేందుకు డంపింగ్ యార్డుకు అవసరమైన సొంత స్థలం లేదు. గ్రామ ఆవాసాల మధ్య గంజి వారి ఆలయం వెనుక, హైస్కూల్ ప్రహారీని ఆనుకుని, మీసేవ- ఎస్సీ కాలనీ ఆనుకుని, గుర్యయ్య కట్టు వద్ద ఇలా ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడే గ్రామంలో సేకరించిన చెత్తను పంచాయతీ సిబ్బంది డంప్ చేశారు. గ్రామస్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. జిల్లా, మండల అధికారులకు గ్రామ పంచాయతీ తరపున పలు మార్లు వినతులందించారు. ఎట్టకేలకు గ్రామ శివారులో 65/11లో ప్రభుత్వ స్థలం 70 సెంట్లు 2023 ఆగస్టులో ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఈ స్థలంలో అప్పటి నుంచి గ్రామంలో సేకరించిన చెత్తను డంప్ చేసేవారు. దీనిపైనా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ స్థితిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడ చెత్తను ఉప్పాడ వద్ద యారాడ థర్మల్ విద్యుత్ తయారీ కేంద్రానికి రెండు, మూడుసార్లు తరలించారు. దీనికి ఒక్కలారీ చెత్త తరలింపునకు రూ.13 నుంచి 15 వేల వ్యయమయ్యేది.ఇంత ఖర్చు భరించలేమని పంచాయతీ చేతులెత్తేసింది. దీంతో గ్రామ శివారులో గుర్రయ్యకట్టు వద్దనున్న శ్మశానం వద్ద పది రోజులపాటు చెత్తవేయగా, అక్కడి వారు అడ్డగించారు. ఈ స్థితిలోగత నాలుగు రోజులుగా గ్రామ వీధుల్లో చెత్తను ఊడ్చడం మానేశారు. దీంతో దుర్వాసన, ఈగలు, దోమల బెడద పెరిగింది. ఇకనైనా ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, అక్టోబరు 22: మండలంలోని బి.కింతాడ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి 12 వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలగ నుందని ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. అలమండ, కొత్తపెంట, ములకలాపల్లి, జగన్నాధపురరం, వేచలం, గవరవరం, జగన్నాధపురం, బి.కింతాడ ప్రజలు సహకరించాలన్నారు.

మాడుగులలో..

మాడుగుల రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నర్సీపట్నం ఈఈ ఎ.వి.ఎస్.ఎం అప్పారావు తెలిపారు.

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాది, పోలేపల్లి, రాజాం సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటలనుంచి 10.30 వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని డీఈ ఏవీఎస్ అప్పారావు తెలిపారు. వడ్డాది సబ్ స్టేషన్‌లో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

రావికమతం: మండలంలోని రావికమతం, కొత్తకోట, తట్టబంద సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈపీడీసీఎల్ నర్సీపట్నం డివిజన్ ఈఈ ఏవీఎస్ఎం అప్పారావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చీడికాడ: మండలంలో 21 గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ విద్యుత్ నిలుపుదల చేయనున్నారని సంబంధితశాఖ ఏఈఈ నమ్మి వెంకటరావు తెలిపారు. చీడికాడ, అప్పలరాజుపురం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో పవర్‌కట్ ఉంటుందన్నారు.

కె.కోటపాడు: మండలంలో విద్యుత్ లైన్లు మరమ్మతుల శుక్రవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. చౌడువాడ, మల్లంపాలెం, గరుగుబిల్లి, గుల్లేపల్లి, చింతపాలెం, గొండుపాలెం గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్తీకమాసం సందడి



తెల్లవారుజామున స్నానమాచరిస్తున్న కార్తీకమాస భక్తులు

మాడుగుల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం కావడంతో శివాలయాల సమీపంలోని నదులు, చెరువుల్లో భక్తుల స్నానాల సందడి నెలకొంది. మండల కేంద్రంలో ఉబ్బలింగేశ్వర, భీమలింగేశ్వర ఆలయాల్లో గురువారం తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే భక్తుల సందడి కనిపిస్తుంది. ఉబ్బలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో కొండప్రాంతం నుంచి పారేనీటిలో స్నానాలు ఆచరిస్తున్నారు. అనంతరం శివుని దర్శించుకుని పూజలు చేస్తున్నారు.

వర్షంతో కోనాం సంత వెలవెల



సంతలో లేని కొనుగోలుదారులు

చీడికాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురువారం కోనాంలో జరిగిన సం తకు వె ల వె ల పో యిం ది. ఉదయం నుంచి చినుకులు పడుతుండటంతో అటు ఏజెన్సీనుంచిగాని, ఇటు మైదాన ప్రాంతం నుంచి వచ్చే కొనుగోలు దారులు ఆశించినంతగా రాలేదు. దీంతో చిరువ్యాపారులు నిరాశకు గురయ్యారు.

మాడుగుల/ రూరల్: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలంలో ఉదయం నుంచి మబ్బులు కమ్ముకున్న వాతావరణం నెలకొంది. సాయంత్రం ఐదు గంటలకు పలు గ్రామాల్లో తేలికపాటి జల్లులతో వర్షం పడింది.

దివ్యాంగులకు బోధనోపకరణ కిట్లు

రావికమతం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఆరుగురు మానసిక దివ్యాంగ విద్యార్థులకు రూ.60 వేల విలువైన మేధోవైకల్య బోధనోపకరణాల సామాగ్రి కిట్లను జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయ అధికారి బి. రామకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో అందించినట్టు స్థానిక ప్రత్యేక ఉపాధ్యాయుడు బి. మహాలక్ష్మీనాయుడు తెలిపారు.ఈ కార్యక్రమంలో భవిత కేంద్ర ఉపాధ్యాయుడు జగన్నాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

దేవరాపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీల్లో తెనుగుపూడి గురుకుల విద్యార్థులు ప్రతిభ చూపినట్టు ప్రిన్సిపాల్ విక్టర్‌పాల్ గురువారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 17 నుంచి 18వ తేదీ వరకు జరిగిన మండలస్థాయి ఆటల పోటీల్లో 64 మంది పాల్గొన్నారన్నారు. అండర్ 14 విభాగ ఖోఖో, యోగా, వాలీబాల్, చదరంగం పోటీల్లో విన్నర్స్‌గాను నిలిచారన్నారు. కబడ్డీలో రన్నర్స్‌గా గెలపొందారన్నారు. 200 మీటర్ల పరుగు పందెంలో జి.జస్వంత్, 8వతరగతి విద్యార్థి ప్రథమ స్థానం, సి.హెచ్ అశోక్ 9వ తరగతి ద్వితీయ స్థానం సాధించారు. 400 మీటర్ల పరుగులో అశోక్ ప్రథమ స్థానం, జశ్వంత్ దినేశ్ తృతీయ స్థానం సాధించారు. 600 మీటర్ల పరుగులో మొదటి స్థానాన్ని జి.జశ్వంత్, ఎల్.దినేశ్, కె.అశోక్ గెలుపొందారు. వీరిని ఎంఈఓ ఉషారాణి, ప్రిన్సిపాల్. పీఈటీ తరుణేశ్వరరావు, ఇరటా నరసింహమూర్తి అభినందించారు.

మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణపై సంతకాల సేకరణ



వేచలంలో సంతకాలు సేకరిస్తున్న ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, వైసీపీ నేతలు

దేవరాపల్లి, అక్టో బరు 23 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకంగా మండలంలోని వేచలంగ్రామంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణలో ఎంపీపీ చిం తల బుల్లిలక్ష్మి, మండల వైసీపీ నాయకులు గురువారం పాల్గొన్నారు.జడ్పీటీసీ సభ్యుడు కర్రిసత్యం, వైసీపీ మండల అధ్యక్షుడు బూర బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం కింతలి వల్లాపురంలో సంతకాల సేకరణచేపట్టారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణాలను తొలగించాలి: సీపీఎం

మాడుగుల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాడుగుల ఎక్సైజ్ స్టేషన్ పరిధి గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలను తక్షణమే తొలగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం దుకాణాలతో సమస్యలు నెలకొంటున్నాయన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం షాపుల వల్ల అత్యాచారాలు, దొంగతనాలు అధికమవుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి వెంకన్న, మండల కార్యదర్శి నర్సింహమూర్తి, భవాని పాల్గొన్నారు.

వర్షమొస్తే చెరువే..

గోతులమయంగా తాళ్లపాలెం - నర్సీపట్నం రోడ్డు

» వర్షానికి గోతులు నిండిపోయి వాహనచోదకుల అవస్థలు



చెరువును తలపిస్తున్న తాళ్లపాలెం వారపు సంత వద్ద రోడ్డు

కశింకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం - నర్సీపట్నం ప్రధాన రహదారి భారీ గోతులతో అధ్వానంగా తయారైంది. గురువారం కురిసిన వర్షానికి గోతులన్నీ వర్షానికి నిండిపోయి చెరువులను తలపించాయి. ఈ మార్గం గుండా నర్సీపట్నం, చింతపల్లి, సీలేరు తదితర మండలాలకు చేరుకుంటారు. అయితే ఈ రోడ్డు దారుణంగా ఉండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాళ్లపాలెం కూడలి నుంచి వారపు సంత వరకు అడుగడుగునా పెద్ద గోతులు కనిపిస్తున్నాయి. తాళ్లపాలెం వారపు సంత వద్ద రెండు చోట్ల చెరువును తలపించేలా వర్షపునీరు నిలిచిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాళ్లపాలెం, నర్సీపట్నం రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తాళ్లపాలెం వద్ద భారీ గోతులతో దర్శనమిస్తున్న నర్సీపట్నం వెళ్లే ప్రధాన రహదారి



వారపు సంత సమీపంలో రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

'స్వామి వివేకానంద స్ఫూర్తితో ఉన్నతంగా ఎదగాలి'



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ, ఐటీడీఏ పీవో శ్రీపూజ

పాడేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ఉన్నతంగా ఎదగాలని ఇన్‌చార్జి జేసీ, ఐటీడీఏ పీవో శ్రీపూజ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన యువజనోత్సవాల్లో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు తమ భవిష్యత్తుపై ఈ దశలోనే ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి లక్ష్యాన్ని సాధించాలని ఆమె ఆకాంక్షించారు. అంతకు ఆమె వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ కవిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్ఎన్ఎల్‌యూతో అమెరికన్ సంస్థ ఒప్పందం



ఒప్పంద పత్రాలు ప్రదర్శిస్తున్న డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు, అమెరికన్ సంస్థ ప్రతినిధి, రిజిస్ట్రార్

సబ్బవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంతో అమెరికాకు చెందిన డీన్‌వాన్ లెవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు వర్సిటీలో గురువారం ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, వీసీ ప్రొఫెసర్ డి. సూర్యప్రకాశరావు, రిజిస్ట్రార్ డాక్టర్ మాదాసు విశ్వచంద్రనాథ్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం ప్రాథమిక లక్ష్యం డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థుల్లో భావోద్వేగ మేధస్సు, అంతర్గత శాంతి, భారతీయ జ్ఞాన వ్యవస్థలపై లోతైన అవగాహనను ప్రోత్సహించడం, వర్క్‌షాప్‌లు, శిక్షణా సెషన్లు, ఇంటరాక్టివ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమన్నారు. డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ మాట్లాడుతూ విద్య, వృత్తి జీవితంలో కీలకమైన వారి వ్యక్తిగత నైపుణ్యాలు, నిర్ణయం తీసుకునే సామర్థ్యాలు, నాయకత్వ లక్షణాలు, భావోద్వేగ స్థితిస్థాపకతను పెంపొందించే లక్ష్యంతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు.

ముసురు

... 5వ పేజీ తరువాయి

వర్షం కురిసింది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ ఎప్పటి మాదిరిగానే చెరువును తలపించింది. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట రోడ్డు పల్లంగా ఉండడంతో వర్షపునీరు నిలిచిపోయి ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బంది పడ్డారు.

శారదా నదిలో పెరిగిన వరద

అనకాపల్లి వద్ద శారదా నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఎగువున ఉన్న పెద్దేరు, రైవాడ, కోనాం జలాశ యాలు పూర్తిగా నిండిపోయి, తరచూ గేట్లు ఎత్తుతుండడంతో శారదా నదిలో వరద ప్రవాహం పెరిగింది. రెండు రోజుల క్రితం వరకు సాధారణంగా ఉన్న ప్రవాహం క్రమేపీ పెరుగుతున్నది. శారదా నది ఒడ్డున ఉన్న ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం వెనుక మెట్ల వరకు వరద నీరు వచ్చేసింది.

వారా నూకరాజు హత్య కేసులో ఏడుగురి అరెస్టు

» నిందితుల్లో ఇద్దరు మహిళలు

» వివరాలను వెల్లడించిన డీఎస్పీ శ్రావణి



హత్య కేసులో పోలీసులు అరెస్టు చేసిన నిందితులతో డీఎస్పీ శ్రావణి, కోటేశ్వరరావు, ఎస్ఐ రామకృష్ణారావు

రోలుగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): **అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు హత్య కేసుకు సంబంధించి ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్టు అనకాపల్లి డీఎస్పీ శ్రావణి తెలిపారు. ఆమె గురువారం ఉదయం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.**

రోలుగుంట మండలం ఎంకేపట్నం పంచాయతీ శివారు ఛటర్జీపురం గ్రామంలో 139 సర్వే నంబరులో 10.83 ఎకరాల భూమిని వారా నూకరాజు కొనుగోలు చేశారు. అప్పటికే ఈ భూములను సాగు చేసుకుంటున్న స్థానిక గిరిజనులకు, నూకరాజుకు మధ్య గొడవలు మొదలయ్యాయి. ఇందుకు సంబంధించి నర్సీపట్నం కోర్టులో సివిల్ దావా నడుస్తున్నది. 2023లో ఇరువర్గాలు కర్రలతో కొట్లాటకు దిగగా నూకరాజు కుమారుడు కన్నబాబుకు తీవ్రగాయాలయ్యాయి. పరస్పర ఫిర్యాదుల మేరకు రోలుగుంట పోలీసులు కేసులు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం తహశీల్దారు సమక్షంలో ఇరువర్గాలు గొడవ పడకుండా బైండోవర్ చేశారు. ఈ ఏడాది మార్చిలో నూకరాజు, అతని అనుచరులు ఛటర్జీపురంలో గిరిజనులు సాగుచేసుకుంటున్న భూముల్లోకి వెళ్లి, అరటితోటను నరికివేశారు. దీంతో ఇరువర్గాలు మరోసారి కొట్లాటకు దిగాయి. పరస్పర ఫిర్యాదుపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో వారా నూకరాజు, మరికొంత మందితో కలిసి కర్రలు, కత్తులతో ఛటర్జీపురంలో వివాదాస్పద భూమి వద్దకు వస్తుండగా.. సాగుదారుల్లో ఒకరైన కేదారి రాజుబాబు చూసి, మరో రైతు నీలాపు అప్పలనాయుడుకు ఫోన్ చేశాడు. దీంతో అప్పలనాయుడుతోపాటు నీలాపు ఎరకన్న, నీలాపు లక్ష్మణ్, కేదారి రాజేశ్వరి, ఈదల రాజేశ్వరి, నీలాపు అప్పలనాయుడు కర్రలు, కత్తులు పట్టుకొని అరటి తోట వద్దకు బయలుదేరారు. ఈ క్రమంలో నూకరాజు, అతని అనుచరులు దిగువ మడిలో ఉన్న అరటి తోటను నరికివేసి, ఎగువ మడిలోకి అరటి తోటను నరకడం మొదలుపెట్టారు. ఈ సమయానికి సాగుదారులు బిగ్గరగా కేకలు వేస్తూ తోటకు వద్దకు వచ్చారు. వీరి చేతుల్లో కర్రలు, కత్తులు వుండడంతో నూకరాజు వెంట వచ్చిన వారు భయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు. నీలాపు అప్పలనాయుడు కర్రతో నూకరాజు తల వెనుక భాగంలో బలంగా కొట్టడంతో అతనుకిందపడిపోయాడు. అనంతరం కేదారి రాజుబాబు కత్తితో నూకరాజు తల ఎడమ వైపున రెండుసార్లు గట్టిగా కొట్టగా, మిగతా వారు కర్రలతో కొట్టారు. దీంతో నూకరాజు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. నూకరాజు కుమారుడు కన్నబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నీలాపు ఎరకన్న, నీలాపు లక్ష్మణ్, కేదారి రాజేశ్వరి, ఈదల రాజేశ్వరి, నీలాపు అప్పలనాయుడు, ఎన్.అప్పలనాయుడు, కేదారి రాజుబాబులపై కేసు నమోదుచేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో నిందితులు తమ పశువులకు నీరు, దాణా పెట్టేందుకు ఇళ్లకు రాగా, పోలీసులు పట్టుకున్నారు. మీడియా సమావేశంలో కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ రామకృష్ణారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార భద్రతా నిబంధనలు పాటించని సంస్థలపై కేసులు

» ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి కె.సతీశ్‌బాబు



మాల్‌లో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి సతీశ్‌బాబు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతా నిబంధనలు అమలు చేయని వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేస్తామని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా జిల్లా అధికారి కె.సతీశ్‌బాబు హెచ్చరించారు. వినియోగదారుల ఫిర్యాదు మేరకు పట్టణంలోని ప్రముఖ వ్యాపార సంస్థలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాల పరిమితి ముగిసిన కొన్ని ఆహార పదార్థాలను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా సతీశ్‌బాబు మాట్లాడుతూ వినియోగదారులు నిశితంగా పరిశీలించాక ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు కొనుగోలు చేయాలని సూచించారు. వ్యాపార సంస్థలు వినియోగదారులకు ఇచ్చే రశీదు, ఇన్‌వాయిస్‌ల్లో ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సు, రిజిస్ట్రేషన్ నంబర్లను స్పష్టంగా ముద్రించాలన్నారు. వినియోగదారులను తప్పుదోవ పట్టించకుండా ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కన్సూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ ఆహార పదార్థాల కల్తీ నియంత్రణ, నిబంధనలు పాటించని సంస్థలపై కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ పరిధిలోని నేషనల్ కన్సూమర్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నంబరు 1915కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

దొంగనోట్ల ముఠా గుట్టు రట్టు



నకిలీ నోట్లను చూపిస్తున్న డీసీపీ మేరీ ప్రశాంతి, ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి. (ఇన్‌సెట్‌లో) పోలీసులు స్వాధీనం చేసుకున్న పరికరాలు, దొంగనోట్లు

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దొంగనోట్ల ముఠా గుట్టును నగర పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో మధ్యప్రదేశ్‌కు చెందిన కీలక నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి దొంగనోట్ల ప్రింట్‌లు, ల్యాప్‌టాప్, ప్రింటర్‌తోపాటు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ మేరీప్రశాంతి వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని బర్వానీ జిల్లా సెంధ్వా తాలుకా కెర్మలా గ్రామానికి చెందిన శ్రీరామ్ అలియాస్ గుప్తా (60)ను దొంగనోట్ల తయారీ కేసులో ఉజ్జయిని ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన గంగాధర్ అనే వ్యక్తి ద్వారా విశాఖ నగరంలోని ఎంవీపీ కాలనీ సెక్టార్ 11లో నివాసం ఉంటున్న పాల వరప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. వీరంతా అనంతపురంలో కలిసినప్పుడు దొంగనోట్ల తయారీ గురించి ప్రస్తావన వచ్చింది. విశాఖలోని తన ఇంట్లో దొంగనోట్లు తయారుచేసుకోవచ్చునని వరప్రసాద్ సమ్మతి తెలిపాడు. దీంతో కొన్నాళ్ల కిందట శ్రీరామ్ దొంగనోట్ల తయారీకి అవసరమైన ప్రింటర్, తెల్ల పేపర్లు, కటింగ్ యంత్రాలు, గమ్, రంగులు వంటి వాటిని ముంబై తెప్పించి వరప్రసాద్ ఇంట్లో పెట్టాడు. మొదటి దశలో రూ.పది లక్షలు విలువైన రూ.500, రూ.200 నకిలీ నోట్లను తయారుచేసి, నగరానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి ద్వారా చలామణి చేసేందుకు విఫలయత్నం చేశారు. మళ్లీ రూ.500, రూ.200 నకిలీనోట్ల తయారీని ఇటీవల ప్రారంభించాడు. దీనిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రావడంతో ఎంవీపీ పోలీసులతో కలిసి బుధవారం రాత్రి వరప్రసాద్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో దొంగనోట్లు తయారుచేస్తూ శ్రీరామ్ పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి ల్యాప్‌ట్యాప్, ప్రింటర్‌తోపాటు ఒకే పేపర్‌పై నాలుగు చొప్పున రూ.500, రూ.200 నకిలీనోట్లు ప్రింట్ చేసిన కాగితాలతోపాటు పేపర్ కటింగ్ గ్లాస్ టేబుల్, తెల్ల పేపర్‌కట్టలు రెండు, నకిలీనోట్ల సాఫ్ట్ కాపీలు కలిగిన పెన్ డ్రైవ్, గమ్ బాటిల్, గ్రీన్ థ్రెడ్ వంటి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శ్రీరామ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. మిగిలినవారి కోసం గాలిస్తున్నారు. ఈ సమావేశంలో ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, ఎంవీపీ సీఐ కేఎస్ఎస్‌వీ ప్రసాద్, టాస్క్‌ఫోర్స్ సీఐ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా భూ కబ్జాలు

... 5వ పేజీ తరువాయి

చేసుకుని, సదరు నేతపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ భూమి విలువ సుమారు రూ.50 కోట్లు వుండడంతో మరోసారి కబ్జాకు యత్నించాడు. స్థానిక రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఇటీవల గోతులు తీయించి, జీడిమామిడి మొక్కలు నాటించాడు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు మొక్కలను తొలిగించారే తప్ప, భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మొక్కలు నాటిని వ్యక్తిపై కేసు నమోదు చేయించలేదు.

తామరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 60, 61, 62, 63లలో సుమారు 250 ఎకరాల బంజరు భూముల్లో చిన్న, సన్నకారు రైతులు మామిడి, జీడిమామిడి తోటలను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. కొంతమంది టీడీపీ, వైసీపీ నాయకులు రంగప్రవేశం చేసి, ఈ భూముల సాగుదారులకు కొంతసొమ్ము ముట్టజెప్పి, రెవెన్యూ అధికారుల సహాయంతో తమ పేరున పట్టాలు, పాసుపుస్తకాలు పొందేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు.

మామిడిపాలెం సర్వే నంబరు-1లో సుమారు 50 ఎకరాల కొండపోరంబోకు భూమి ఉంది. ఇందులో 20 ఎకరాలు సాగుదారుల ఆధీనంలో ఉంది. మిగిలిన 30 ఎకరాలను ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాచపల్లి 737 సర్వే నంబరులో వున్న 406 ఎకరాల కొండపోరంబోకు భూములను 468 రైతులు సాగు చేసుకుంటున్నట్టు అధికారులు ఇటీవల సర్వే చేసి గుర్తించారు. ఇదే సర్వే నంబరులో మరో 450 ఎకరాల ప్రభుత్వ భూమి రైతుల సాగులో ఉంది. జి.వెంకటాపురం, జి.కోడూరు రెవెన్యూలో సుమారు 90 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉంది.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో వ్యాన్ డ్రైవర్ మృతి



గీతాకృష్ణ మృతదేహం

కోటవురట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఒక వ్యాన్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన గురువారం పందూరు గ్రామ శివారు బంధ సమీపంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి కోటవురట్ల ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన మోటిపల్లి గీతాకృష్ణ(22) కోటవురట్ల మండలం పందూరు గ్రామ శివారు బంధ సమీపంలోని 73 హిల్స్ సైట్‌లో వ్యాన్ డ్రైవర్‌గా ఉంటున్నాడు. గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో సైట్ నుంచి పందూరు జంక్షన్‌కు విద్యుత్ సామగ్రి కొనుగోలు చేయడానికి వ్యాన్‌లో బయలుదేరాడు. వ్యాన్‌ను నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. దీంతో విద్యుత్ తీగలు వ్యాన్‌పై పడి విద్యుదాఘాతానికి గురై అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులు కృష్ణా జిల్లా నుంచి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కోటవురట్ల ఆస్పత్రికి తరలించారు.

పాము కాటుకు గురై కౌలు రైతు మృతి



మృతిచెందిన తోట రమణ

ఎస్.రాయవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారంలో వరి పొలంలో గురువారం కలుపు తీస్తున్న కౌలు రైతు పాము కాటుకు గురై మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన తోట రమణ(50) ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారంలో కొంత వ్యవసాయ భూమిని కౌలుకి తీసుకుని వరి పంట సాగుచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం కొంతమంది కూలీలను పెట్టి వారితోపాటు తను కూడా కలిసి వరి పొలంలో కలుపు తీస్తుండగా పొలంలో ఉన్న పాము తోట రమణను కాటేసింది. దీంతో అక్కడే ఉన్న స్థానికులు రమణను వెంటనే నక్కపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా రమణను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. జరిగిన సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

నక్కపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల హైవేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి నక్కపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని జి.జగన్నాథపురం గ్రామానికి చెందిన జల్లూరి సుదర్శనరావు(73) గురువారం ఉదయం గొడిచెర్ల హైవేపై బైక్‌పై వెళుతుండగా విశాఖ నుంచి తుని వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో ఇద్దరిని సైబర్ క్రైం పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్స్ఛేంజ్ 666 ఆన్‌లైన్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలానికి చెందిన మాసారపు దక్షిణామూర్తి, చుక్కా రఘురామ్‌ను అరెస్టు చేసి బెట్టింగ్‌కు వినియోగిస్తున్న సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పేకాట శిబిరాలు నిర్వహిస్తే చర్యలు

» పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

పరవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామ శివారుల్లో ఎక్కడైనా పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పరవాడ డీఎస్పీ వి. విష్ణుస్వరూప్ హెచ్చరించారు. గురువారం పరవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21న పెదముషిడివాడ పంచాయతీ పరిధి నక్కవానిపాలెం శివారులో పెద్ద ఎత్తున పేకాట శిబిరాన్ని నిర్వహించగా, స్థానికుల సమాచారం మేరకు దాడులు చేసి రూ.19 లక్షల 20 వేల 320లను స్వాధీనం చేసుకున్నామన్నారు. 18 మందిని అరెస్టు చేశామని తెలిపారు. వీరి నుంచి 17 మొబైల్ ఫోన్లు, ఒక కారు, రెండు బైక్‌లు సీజ్ చేశామన్నారు. ఈ క్రమంలోనే పేకాట స్థావరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. ప్రతి రోజూ శివారు గ్రామాలపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐలు కృష్ణారావు, మహాలక్ష్మి పాల్గొన్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు

... 5వ పేజీ తరువాయి

చేయించారు. రూ.5 లక్షలతో ఆపరేషన్ థియేటర్‌లో సెంట్రల్ ఆక్సిజన్ వ్యవస్థను ఏర్పాటు చేయించారు. తాజాగా రూ.40 లక్షల స్పెషల్ గ్రాంట్‌తో ఏపీఎంఐడీసీ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో డ్రైనేజీ ఆధునికీకరణ, మరుగుదొడ్ల మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఆస్పత్రి వెనుక భాగంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ముందు ఇంకుడు గొయ్యి నిర్మిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే ఆస్పత్రి ఆవరణలో డ్రైనేజీ వుండదు. ప్రసూతి విభాగంలో నిరుపయోగంగా ఉన్న ఎస్ఎన్‌సీయూ గది ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. దీనిని కూడా ప్రసూతి విభాగానికి ఉపయోగిస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద తెలిపారు.

ఆస్పత్రిలో క్యాంటీన్

ప్రాంతీయ ఆస్పత్రిలో క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నారు. కేఎల్‌పురానికి చెందిన స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ) సభ్యురాలు రాజ్యలక్ష్మికి మూడు సంవత్సరాలపాటు క్యాంటీన్ నడుపుకోవడానికి అనుమతి ఇచ్చారు. మండల సమాఖ్య స్త్రీ నిధి నుంచి రూ.లక్ష, సీఐఎఫ్ నుంచి రూ.50 వేలు రుణంగా మంజూరు చేశారు. ఏరియా ఆస్పత్రి త్వరలో క్యాంటీన్ అందుబాటులోకి రానుంది.

జగన్ ఆరోపణలు అవాస్తవం

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ, అసత్య ప్రచారాలు, శవ రాజకీయాలకు కేరాఫ్ జగన్ అని ఎద్దేవా చేశారు. మద్యం విధానంపై మాట్లాడే నైతిక అర్హత జగన్మోహన్‌రెడ్డికి లేదన్నారు. అధికారంలోకి వస్తే మద్యాన్ని సంపూర్ణంగా నిషేధిస్తానని చెప్పిన ఆయన.. చివరికు నకిలీ బ్రాండ్లతో కోట్లాది రూపాయలు దోచుకున్నారని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో నాసిరకం మద్యం తాగి 30 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారన్నారు. కొవిడ్ సమయంలో ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టిన ఘనుడు జగన్ అని మండిపడ్డారు. సమావేశంలో బీజేపీ నాయకులు చొక్కాకుల వెంకటరావు, సురేంద్ర మోహన్ ఉన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549